


PRGI NO: TGTEL/25/A5314

# అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక

ఎడిటర్ : లింగం రాజయ్య
బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్




నల్లగొండ | హైదరాబాద్ | రంగారెడ్డి | epaper.arjun saamaacharam.com | ఆదివారం 7, జూన్ 2026 | సంపుటి :1 సంచిక : 162 | పేజీలు : 8 , వెల.2.00



## లక్షలాది మంది విద్యార్థుల

# భవిష్యత్తుతో కేంద్రం చెలగాటం

నీట్–యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో పరీక్షను రద్దు చేయడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని చేతగాని తనం వల్ల లక్షలాది విద్యార్థులు రోడ్డున పడే పరిస్థితి దాపురించిందన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని మండిపడ్డారు.

- కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి
- ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వారి శ్రమ వృధా
- నష్టపోయిన విద్యార్థుల కుటుంబాలకు అండ
- విద్య, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- ప్రజలపై కేంద్రం ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచింది
- టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్

2 లో..



## అది పూర్తిగా మా అంతర్గత విషయం.. పాకిస్థాన్‌కు భారత్ కౌంటర్..

ఐక్యరాజ్యసమితి వేదికగా జమ్మూ కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించిన పాకిస్థాన్‌కు భారత్ మరోసారి గట్టి సమాధానం ఇచ్చింది. పాకిస్థాన్ చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమైనవని, తప్పుడు కథనాలను ప్రచారం చేసే ప్రయత్నమని భారత ప్రతినిధి మండలి పేర్కొంది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా పాక్‌కు భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్ కౌంటర్ ఇచ్చారు.

2

## రామలింగారెడ్డి రాజీనామా సమస్య

# పరిష్కారమైంది.. డీకే



కోరుకున్న శాఖను ఇవ్వలేదంటూ మంత్రి పదవికి సీనియర్ నేత రామలింగా రెడ్డి రాజీనామా చేయడంతో ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్వయంగా రంగంలోకి దిగారు. అసంతృప్తి నేతతో చర్చలు జరిపారు. అనంతరం సమస్య పరిష్కారమైనట్టు మీడియాకు వెల్లడించారు.

వార్త 2లో




## ఫోన్ ట్యాపింగ్ నిందితులకు శిక్ష పడాల్సిందే: ఎంపీ చామల కిరణ్ కుమార్

2

## మళ్లీ దాడులకు దిగిన ఇరాన్..

# గల్ఫ్‌లో కలకలం



గల్ఫ్‌లో మళ్లీ కలకలం రేగుతోంది. కువైట్, బహ్రెయిన్‌లను టార్గెట్ చేస్తూ ఇరాన్ శనివారం మిస్సైల్స్‌ను ప్రయోగించడంతో ఉద్రిక్తతలు పెరిగాయి. అమెరికా తమను రెచ్చగొట్టడంతోనే ఈ దాడులు చేయాల్సి వచ్చిందని ఇరాన్ ఆరోపించింది. కువైట్, బహ్రెయిన్ గగనతలంలో మిసైల్స్ దూసుకుపోతున్న దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి.

వార్త 2లో

## మహిళలు ధైర్యంగా పనిచేస్తేనే

# అభివృద్ధి వేగవంతం



ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా సాధికారిత సాధించాలని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. దాని కోసం ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో స్త్రీ రైడ్స్‌ను తీసుకొచ్చామని పేర్కొన్నారు. 55మంది మహిళలకు డ్రైవింగ్ నేర్పించి, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని చెప్పుకొచ్చారు.

వార్త 2లో

## జూన్ 8 నుంచి చేప ప్రసాదం

# పంపిణీ: మంత్రి వాకిటి శ్రీహరి



2 లో..

చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసినట్లు మంత్రి వాకిటి శ్రీహరి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి తెలిపారు. మాట్లాడుతూ.. చేప ప్రసాదం అనేది ప్రజల విశ్వాసంతో ముడిపడి ఉన్న అంశమని, ఎలాంటి ప్రచారాలు చేయకపోయినా దేశం నలుమూలల నుంచి వేలాదిగా ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్నారని వారు పేర్కొన్నారు.



## పంజాబ్‌లో ఘోర రోడ్డుప్రమాదం.. 8మంది మృతి..

పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్–ఫాజిల్కా రహదారిపై శనివారం ఘోర రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. రెండు ట్రక్కులు ఎదురెదురుగా ఢీకొని 8మంది ప్రాణాలు కోల్పోగా.. 15మంది తీవ్రంగా గాయపడ్డారు.

2



2

## తమిళనాట బీజేపీకి వరుస షాక్‌లు.. సుమతి వెంకటేశ్ రాజీనామా

## జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్

# జనతా పార్టీ ఆందోళన

**ఢిల్లీ:**

దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళన చేపట్టింది. కాక్రోచ్ జనతా పార్టీ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పిలుపు మేరకు యువత భారీగా తరలివస్తున్నారు. నీట్ పేపర్ లీక్, సిబిఎస్ఇ ఓఎస్ఎం వివాదంపై సిజెపి నిరసన తెలుపుతోంది. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. సిజెపి



ధర్నాకు పోలీసుల అనుమతి ఇచ్చారు. సిజెపి నేతలు శాంతియుతంగా నిరసన తెలుపుతున్నారు. సాయంత్రం ఐదు గంటల వరకు నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు. కాక్రోచ్ మాస్కులతో యూత్ నిరసనకు తరలివచ్చారు. శనివారం ఉదయం కాక్రోచ్ జనతా పార్టీ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అమెరికా నుంచి ఢిల్లీ చేరుకున్నారు. జంతర్ మంతర్ తో పాటు పలు చోట్ల పోలీసులు భారీగా మోహరించారు.

## కల్వర్టుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన సీతక్క

**ములుగు:**

శనివారం ములుగు మున్సిపాలిటీ పరిధిలో పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నగరాభివృద్ధి నిధుల ద్వారా రూ.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న కల్వర్టుల నిర్మాణ పనులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ చైర్ పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, మున్సిపల్ కమిషనర్ సంపత్, వైస్ చైర్మన్ ఆసియా షాహిన్,కౌన్సిలర్లు,స్థానిక ప్రజాప్రతినిధులు,కో ఆప్షన్ సభ్యులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అది పూర్తిగా మా అంతర్గత విషయం.. పాకిస్థాన్‌కు భారత్ కౌంటర్..

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

ఐక్యరాజ్యసమితి వేదికగా జమ్మూ కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించిన పాకిస్థాన్‌కు భారత్ మరోసారి గట్టి సమాధానం ఇచ్చింది. పాకిస్థాన్ చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమైనవని, తప్పుడు కథనాలను ప్రచారం చేసే ప్రయత్నమని భారత ప్రతినిధి మండలి పేర్కొంది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా పాక్‌కు భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్ కౌంటర్ ఇచ్చారు. 'జమ్మూ కశ్మీర్ గతంలోనూ, ప్రస్తుతం, భవిష్యత్తులోనూ భారతదేశంలో అంతర్భాగంగానే ఉంటుంది. పాకిస్థాన్ అంతర్జాతీయ వేదికలను తన రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తోంది. జమ్మూ కశ్మీర్‌కు సంబంధించిన అన్ని విషయాలు పూర్తిగా భారతదేశ అంతర్గత విషయాలు. పాకిస్థాన్ డొల్ల మాటలు, వాదనలు ఈ ప్రాథమిక వాస్తవాన్ని మార్చలేవు' అని హరీష్ పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితిలో పాకిస్థాన్.. కశ్మీర్‌ను 'అంతర్జాతీయంగా గుర్తించిన వివాదాస్పద ప్రాంతం'గా పేర్కొంది.కాగా, గిల్గిత్-బాల్టిస్తాన్ ప్రాంతానికి జూన్ 7న సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలన్న పాకిస్థాన్ ప్రణాళికలపై విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది ఆ ప్రాంతం చట్టవిరుద్ధంగా, బలవంతంగా ఆక్రమణకు గురైన భారత భూభాగమని పేర్కొంది. గిల్గిత్-బాల్టిస్తాన్ అనేది లడఖ్‌లో భాగమని, ప్రస్తుతం అది పాకిస్థాన్ ఆక్రమణలో ఉందని భారత్ చెబుతోంది. అందుకే అక్కడ ఎన్నికలు నిర్వహించడాన్ని భారత్ వ్యతిరేకిస్తోంది.

# పంజాబ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. 8మంది మృతి..

చండీగఢ్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్-ఫాజిల్కా రహదారిపై శనివారం ఘోర రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. రెండు ట్రక్కులు ఎదురెదురుగా ఢీకొని 8మంది ప్రాణాలు కోల్పోగా.. 15మంది తీవ్రంగా గాయపడ్డారు. బాధితులంతా ఇటీవల మృతిచెందిన తమ బంధువు అస్థికలను నీటిలో కలిపేందుకు వెళ్తుండగా ఈ ఘోరం జరిగింది. ప్రమాదానికి గురైన వారిని జలాలాబాద్ వాసులుగా పోలీసులు గుర్తించారు.బాధితులు తమ బంధువు అస్థికలను తీసుకుని బియాస్‌లోని రాధా సోమీ దేరాకు శనివారం ఉదయం ప్రయాణం మట్నదలుపెట్టారు. సుమారు 25 మంది మహీంద్రా పికప్ వాహనంలో బయలుదేరారు. అయితే, వాహనం జంగవాలా గ్రామ సమీపానికి రాగానే ఎదురుగా వచ్చిన మరో ట్రక్కును ప్రమాదవశాత్తూ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మరణించగా.. మరో నలుగురు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ప్రాణాలు కోల్పోయారు.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, వైద్య సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని ఫిరోజ్‌పూర్‌లోని సివిల్ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో చాలా మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం. కుటుంబ సభ్యులు, బంధువుల మృతితో ప్రమాద స్థలం, ఆస్పత్రి ప్రాంగణంలో బాధితుల రోదనలు మిన్నంటాయి. మరోవైపు ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీస్తున్నారు.

# తమిళనాట బీజేపీకి వరుస షాక్‌లు.. సుమతి వెంకటేశ్ రాజీనామా

చెన్నై, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

తమిళనాడు భారతీయ జనతా పార్టీలో సంక్షోభం మరింత ముదురుతోంది. ఆ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కే అన్నామలై, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరు నాగరాజన్ పార్టీని వీడిన కొన్ని రోజుల్లోనే, మరో కీలక నేత పార్టీకి గుడ్‌బై చెప్పారు. తమిళనాడు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి (ఫ్షవ ాావఎతీమ్ఖుతీఎ) సుమతి వెంకటేశ్ తన పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘమైన భావోద్వేగ లేఖను పంచుకున్నారు. భారమైన హృదయంతో తప్పుకుంటున్నా నని.. చాలా రోజులు ఆలోచించిన తర్వాతే తానీ కఠినమైన నిర్ణయం తీసుకున్నట్లు సుమతి వెంకటేశ్ తెలిపారు. తమిళనాడు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తూ, పార్టీతో తన అనుబంధాన్ని ముగిస్తున్నానని ఆమె తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. బీజేపీలో పనిచేయడం తనకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నానని కూడా సుమతి అన్నారు.అయితే, పార్టీ వీడినప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం, జాతీయవాదం, దేశభక్తి సిద్ధాంతాలు తనకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని సుమతి వెంకటేశ్ స్పష్టం చేశారు. తన పదవీ కాలంలో సహకరించిన జాతీయ, రాష్ట్ర స్థాయి నేతలు, కార్యకర్తలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

**అన్నామలై బాటలోనే..**

తమిళనాడులో బీజేపీని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లిన కే అన్నామలై ఇటీవల పార్టీకి రాజీనామా చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. వంశపారంపర్య రాజకీయాలు, వ్యక్తిగత ఆరాధనలకు దూరంగా, సాధారణ ప్రజల రాజకీయం తీసుకురావడమే లక్ష్యంగా తాను సరికొత్త రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అన్నామలై దారిలోనే మిగిలిన కీలక నేతలు కూడా నడుస్తుండటం తమిళనాడు రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# రామలింగారెడ్డి రాజీనామా సమస్య పరిష్కారమైంది.. డీకే

బెంగళూరు: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

కోరుకున్న శాఖను ఇవ్వలేదంటూ మంత్రి పదవికి సీనియర్ నేత రామలింగా రెడ్డి రాజీనామా చేయడంతో ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్వయంగా రంగంలోకి దిగారు. అసంతృప్తి నేతతో చర్చలు జరిపారు. అనంతరం సమస్య పరిష్కారమైనట్టు మీడియాకు వెల్లడించారు. జయనగర్‌లోని ఒక ప్రైవేటు హోటల్‌లో శుక్రవారం రాత్రి రామలింగారెడ్డితో డీకే చర్చలు జరిపారు. కాంగ్రెస్ సీనియర్ మంత్రులు, రెడ్డి సన్నిహితులు సైతం ఈ సమావేశంలో పాల్గొన్నారు.'ఇది కుటుంబ వ్యవహారం. కలిసి కూర్చుకుని మాట్లాడుకున్నాం. సమస్య సద్దుమణిగింది. ఆయన తనకున్న ఇబ్బంది ఏమిటో చెప్పారు. సమాచార లోపం వల్లే ఇలాంటివి ఒక్కోసారి జరుగుతుంటాయి. వాటిని మేము పరిష్కరించుకుంటాం. అంతా సజావుగానే ఉంది. మేము సీనియర్లందరికీ అవకాశాలు కల్పిస్తాం. అన్ని వ్యవహారాలు చక్కబెడతాం' అని డీకే తెలిపారు. 1980 నుంచి తామిద్దరం మంచి మిత్రులమనీ, ప్రస్తుతం తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ గతంలో తాము మంత్రులమని, కలిసి పనిచేశామని చెప్పారు.బెంగళూరు అర్బన్ డవలప్‌మెంట్(జీబీఏ) శాఖకు బదులు జలవనరుల శాఖను తనకు కేటాయించడంపై రామలింగారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేస్తూ తన పదవికి శుక్రవారంనాడు రాజీనామా చేసారు. తనకు మాట ఇచ్చి తప్పారంటూ మీడియా ముందే ఆయన తన రాజీనామా పత్రంపై సంతకం చేశారు. ఎమ్మెల్యేగా కొనసాగుతానని చెప్పారు. తన సహచరుడి ద్వారా రాజీనామా పత్రాన్ని డీకేకు పంపారు. అయితే ముఖ్యమంత్రి ఆయన రాజీనామాను అంగీకరించలేదు. సిద్ధరామయ్య సన్నిహితుడిగా రామలింగారెడ్డిని చెబుతారు. రామలింగారెడ్డి రాజీనామాతో కర్ణాటకలో సిద్ధరామయ్య పట్టు కొనసాగుతోందనే అభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి. రెడ్డి రాజీనామాను అంగీకరిస్తే మరికొంత మంది కూడా తమ డిమాండ్లతో ముందుకు రావచ్చని డీకే భావిస్తున్నారని, మంత్రి రాజీనామాను తిరస్కరించడం ద్వారా ఆదిలోనే అసంతృప్తులకు అడ్డుకట్టు వేయాలనే నిర్ణయం తీసుకున్నారని పలువురు విశ్లేషిస్తున్నారు.

# లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రం చెలగాటం

- కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి
- ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వారి శ్రమ వృధా
- నష్టపోయిన విద్యార్థుల కుటుంబాలకు అండ
- విద్యా, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- ప్రజలపై కేంద్రం ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచింది



టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

నీట్-యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో పరీక్షను రద్దు చేయడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని చేతగాని తనం వల్ల లక్షలాది విద్యార్థులు రోడ్డున పడే పరిస్థితి దాపురించిందన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని మండిపడ్డారు. నీట్ పరీక్ష వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు నెలల తరబడి కష్టపడి సిద్ధమైతే, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వారి శ్రమ వృధా అయ్యిందని మహేశ్ అన్నారు. నష్టపోయిన విద్యార్థుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలన ప్రభుత్వం విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తికాగానే సామాన్య ప్రజలపై కేంద్ర ప్రభుత్వం భారాన్ని వేస్తూ ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిందని మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మళ్లీ దాడులకు దిగిన ఇరాన్.. గల్ఫ్‌లో కలకలం

ఇంటర్నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

గల్ఫ్‌లో మళ్లీ కలకలం రేగుతోంది. కువైట్, బహ్రెయిన్‌లను టార్గెట్ చేస్తూ ఇరాన్ శనివారం మిసైల్స్‌ను ప్రయోగించడంతో ఉద్రిక్తతలు పెరిగాయి. అమెరికా తమను రెచ్చగొట్టడంతోనే ఈ దాడులు చేయాల్సి వచ్చిందని ఇరాన్ ఆరోపించింది. కువైట్, బహ్రెయిన్ గగనతలంలో మిసైల్స్ దూసుకుపోతున్న దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ దాడుల నేపథ్యంలో కువైట్, బహ్రెయిన్ ప్రభుత్వాలు సైరెన్‌లు మోగించి ప్రజలను అప్రమత్తం చేశాయి.తాజా దాడులపై స్పందించిన ఇరాన్ సైన్యం ప్రతినిధి.. పరిస్థితి మళ్లీ దిగజారడానికి అమెరికానే కారణమని ఆరోపించారు. కువైట్, బహ్రెయిన్ వైపు వెళుతున్న విమానాలను దారి మళ్లించాలని సూచించారు. అక్కడి ప్రజలు ఎయిర్‌పోర్టులకు దూరంగా ఉండాలని చెప్పారు. మరోవైపు, ఇరాన్ దాడుల నేపథ్యంలో శనివారం కువైట్ ఎయిర్‌పోర్టులో పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి. మరికొన్నింటిని దారి మళ్లించినట్టు ఫ్లైట్ రాడార్ 24 సంస్థ పేర్కొంది. యూఎస్ సైనిక స్థావరాలున్న గల్ఫ్ దేశాలను ఇరాన్ తరచూ టార్గెట్ చేస్తున్న విషయం తెలిసిందే.ఇరాన్ మొత్తం ఏడు మిసైల్స్‌ను కువైట్, బహ్రెయిన్ వైపు ప్రయోగించిందని అమెరికా సైనిక అధికారులు తెలిపారు. తాము ఆరు మిసైల్స్‌ను అడ్డుకున్నామని, ఒక ఇరాన్ మిసైల్ అసలు లక్ష్యాన్నే చేరుకోలేదని చెప్పారు. ఇక తమ సిబ్బందికి ఎలాంటి నష్టం జరగలేదని కూడా అన్నారు. యూఎస్ 5వ ఫ్లీట్ ప్రధాన కార్యాలయం ఇరాన్ దాడుల్లో దెబ్బతిందన్న వార్తలను కూడా తోసిపుచ్చారు.ఇక ఇరాన్ రాడార్ వ్యవస్థలను అమెరికా శుక్రవారం ధ్వంసం చేసింది. వాటితో ప్రాంతీయ భద్రతకు ముప్పు ఉందని పేర్కొంది. ఇరాన్ డ్రోన్‌లను అడ్డుకున్నామని కూడా అమెరికా పేర్కొంది. హిందూ మహాసముద్రంలో ఒక ఇరాన్ నౌకను కూడా అడ్డుకున్నట్టు చెప్పింది. చమురు ఎగుమతితో లాభపడతామనుకున్న ఇరాన్ ప్రయత్నాలకు చెక్ పెట్టామని తెలిపింది.

# ఫోన్ ట్యాపింగ్ నిందితులకు శిక్ష పడాల్సిందే: ఎంపీ చామల కిరణ్ కుమార్

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ఎదుట భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కిరణ్ స్టేట్‌మెంట్‌ను సిట్ అధికారులు రికార్డ్ చేశారు. గతంలో చామల ఫోన్ ట్యాప్ అయినట్లు సిట్ గుర్తించింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వ్యూహరచనలో కిరణ్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఎన్నికల వ్యూహాలను పసిగట్టేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం వారి ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సిట్ విచారణ అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ.. సిట్ ఈరోజు తనను బాధితుడిగా విచారణకు పిలిచిందని అన్నారు.తాను మీడియా కమిటీ చైర్మన్‌గా ఉన్న సమయంలో ఫోన్ ట్యాప్ అయ్యిందని సిట్ అధికారులు చెప్పారని ఎంపీ తెలిపారు. ఆనాడు బీఆర్ఎస్ సొంత పార్టీ మంత్రుల ఫోన్‌లు కూడా ట్యాప్ చేసినట్లు తెలిపారు. 'జులై 30న నా ఫోన్ ట్యాప్ అయినట్లు సిట్ గుర్తించింది. జులై 30 నుంచి అసెంబ్లీ ఎన్నికల వరకు నా ఫోన్ ట్యాప్ అయింది' అని ఎంపీ వెల్లడించారు. నిజాం పాలనలో నిజాం రాజు.. రజాకార్లపై కూడా ఇంతలా నిఘా పెట్టి వేధించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తన ఐఫోన్‌కి అలర్ట్ వచ్చిందని.. అయితే అది నార్మల్‌గా వచ్చే అలర్ట్ అని భావించినట్లు చెప్పారు. ఎన్నికల ప్రచారంలో పార్టీ ముఖ్య నేతలతో మాట్లాడే విషయాలన్నీ తెలుసుకునేవారన్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి వేరే పార్టీకి వెళ్లే వాళ్లని ముందుగానే గుర్తించి బెదిరింపులకి పాల్పడినట్లు ఆరోపించారు.తన ఫోన్ మాత్రమే కాదని... హరీశ్ రావు ఫోన్ కూడా ట్యాప్ చేశారంటూ చామల సంచలన వ్యాఖ్యలు చేశారు. ట్యాపింగ్ విషయం బీఆర్ఎస్ నేతలకు కూడా తెలుసన్నారు. సొంత పార్టీ నేతల ఫోన్‌లను కూడా కేసీఆర్ ట్యాపింగ్ చేయించారని.. అధికారం కోసం కేసీఆర్ ఏమైనా చేస్తారని దుయ్యబట్టారు. అందులో భాగంగానే ప్రతిపక్ష నేతలు, కాంగ్రెస్ నేతల ఫోన్లు ట్యాప్ చేయించారన్నారు. ఫోన్ ట్యాప్ నిందితులకు శిక్ష పడుతుందని భావిస్తున్నట్లు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.



# మహిళలు ధైర్యంగా పనిచేస్తేనే అభివృద్ధి వేగవంతం: డీజీపీ ఆనంద్

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా సాధికారిత సాధించాలని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ (ఠవశ్రీఖఅస్త్రుఖుఖ ఐ+ూ జుఎాాఖుఅఎ) వ్యాఖ్యానించారు. దాని కోసం ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో స్త్రీ రైడ్స్‌ను తీసుకొచ్చామని పేర్కొన్నారు. 55మంది మహిళలకు డ్రైవింగ్ నేర్పించి, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు గిగ్ వర్క్‌లో మగవాళ్లు ఉండేవారని, ఇప్పటినుంచి ఆడవారు కూడా రాబోతున్నారని తెలిపారు. ఈరోజు (శనివారం) హైదరాబాద్ వేదికగా డీజీపీ సీవీ ఆనంద్ మీడియాతో మాట్లాడారు.హైదరాబాద్ సిటీ పోలీస్ చరిత్రలో లా అండ్ ఆర్డర్ పోలీసుస్టేషన్‌కు.. మహిళా ఎస్‌హెచ్‌వో లేరని డీజీపీ ఆనంద్ వివరించారు. తాను హైదరాబాద్ సీపీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మహిళా ఇన్‌స్పెక్టర్లను ఎస్‌హెచ్‌వోలుగా నియమించానని ప్రస్తావించారు. ఇప్పుడు 55 మంది మహిళలు ప్యాసింజర్ రవాణా సేవలు అందిస్తున్నారని వెల్లడించారు. భవిష్యత్తులో తెలంగాణ అంతటా లాజిస్టిక్, కార్గో, డెలివరీ సర్వీస్‌లో మహిళా డ్రైవర్లకు అవకాశం కల్పిస్తామని చెప్పుకొచ్చారు. దేశ జీడీపీ పెరగాలంటే మహిళలు కూడా ధైర్యంగా బయటకు వచ్చి పని చేయాలని డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు.

# జూన్ 8 నుంచి చేప ప్రసాదం పంపిణీ: మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసినట్లు మంత్రి వాకిటి శ్రీహరి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి తెలిపారు. ఏబీఎన్‌తో మాట్లాడుతూ.. చేప ప్రసాదం అనేది ప్రజల విశ్వాసంతో ముడిపడి ఉన్న అంశమని, ఎలాంటి ప్రచారాలు చేయకపోయినా దేశం నలుమూలల నుంచి వేలాదిగా ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్నారని వారు పేర్కొన్నారు.

**అపోహలకు తావు ఇవ్వకుండా..**

చేప ప్రసాదం వల్ల ప్రయోజనం పొందిన వారే ఈ కార్యక్రమానికి ప్రచారం చేస్తున్నారని, శాస్త్రానికి అంతుచిక్కని అనేక విషయాలు ఉన్నాయని వారు వ్యాఖ్యానించారు. అందువల్ల అపోహలకు తావు ఇవ్వకుండా ప్రజలు నమ్మకంతో పాల్గొనాలని సూచించారు.

**చేపపిల్లలు సిద్ధం**

ఈసారి లక్ష మందికి పైగా భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నామని, అందుకు అనుగుణంగా మూడు లక్షలకు పైగా చేపపిల్లలను సిద్ధం చేసినట్లు తెలిపారు. చివరి వ్యక్తి వరకు చేప ప్రసాదం అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టామని చెప్పారు.


**జూన్ 8వ తేదీ రాత్రి 9 గంటలకు**

జూన్ 8వ తేదీ రాత్రి 9 గంటలకు చేప ప్రసాదం పంపిణీ ప్రారంభమై, జూన్ 9వ తేదీ సాయంత్రం వరకు కొనసాగుతుందని వెల్లడించారు. గత సంవత్సరాల కంటే ఎక్కువ సంఖ్యలో కౌంటర్లను ఏర్పాటు చేశామని, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

**అధైర్యపడకండి**

అలాగే 200 మందికి పైగా మత్స్యశాఖ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని సేవలు అందించనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.





# విశాఖలో సైకిల్ తొక్కిన చంద్రబాబు

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

**శ్రీకాకుళం,**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరికీ కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరి జీవితంలో ముఖ్యమైనది పర్యావరణ మన్నారు. పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి సైకిల్ ర్యాలీలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. అనంతరం రామ్మోహన్ మాట్లాడుతూ... పర్యావరణ ప్రభావం మనం పీల్చే గాలి, తాగే నీరు, తినే ఆహారం మీద ఉంటుందన్నారు. చిన్న వయసు నుంచే పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించాలని తెలిపారు. ప్రధాని మోదీ గత 12 సంవత్సరాలుగా స్వచ్ఛభారత్ కార్యక్రమం చేస్తున్నారని కేంద్ర మంత్రి అన్నారు. ప్రధానిని ఆదర్శంగా తీసుకొని దేశ వ్యాప్తంగా స్వచ్ఛభారత్ కొనసాగుతోందన్నారు. మోదీ చేపట్టిన స్వచ్ఛభారత్‌ను ఆదర్శంగా తీసుకుని సీఎం చంద్రబాబు స్వచ్ఛఆంధ్రా కార్యక్రమం చేపట్టారని చెప్పారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని పిల్లలకు కూడా అలవాటు చేయాలన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఈరోజు 15 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. కాలుష్య నివారణ, ఇంధన పొదుపు చర్యల్లో భాగంగానే సీఎం చంద్రబాబు సైకిల్ తొక్కాలని పిలుపునిచ్చారని రామ్మోహన్ తెలిపారు. దీనికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. ఇటీవల 24 లక్షల మంది హైబ్రిడ్ విధానంలో పాల్గొని మహానాడు విజయవంతం చేయడం ఇంధన పొదుపు చర్యలకు ఒక అద్భుతమైన మోడల్ అని చెప్పుకొచ్చారు. ఎ÷-లాస్టిక్ రహిత ఆంధ్రాగా మారుద్దామన్నారు. ప్లాస్టిక్ మహమ్మారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో 59 పాఠశాలలను నెట్ జీరో స్కూల్స్‌గా తీర్చిదిద్ది.. విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ పెంపొందించామన్నారు. శ్రీకాకుళం పట్టణంలో రూ.కోటి వ్యయంతో ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ బోర్డును కేంద్రమంత్రి ఆవిష్కరించారు. ప్రకృతి పరిరక్షణకు ప్రజలందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సైకిల్ తొక్కడమనేది ఇంధన పొదుపు మాత్రమే కాదన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే సైకిల్ తొక్కాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## పర్యావరణ పరిక్షణ అందరి బాధ్యత

**విజయవాడ,**

:ప్రపంచ పర్యావరణ దినోత్సవం, నో వెహికల్ డే సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో సహా ప్రజా ప్రతినిధులు సైకిల్ తొక్కారు. అలానే రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత విజయవాడలో తన నివాసం నుంచి ఆటోనగర్ ఫైర్ స్టేషన్ వరకు సైకిల్ తొక్కారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రోజూ ఓ గంట పాటు సైకిల్ తొక్కడం వల్ల ఓవైపు ఆరోగ్యం, మరోవైపు పర్యావరణం బాగుపడతాయని తెలిపారు. ప్రధాని పొదుపు మంత్రంలో భాగంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిశా నిర్దేశర మేరకు ప్రతి శుక్రవారం నో వెహికల్ డే పాటిస్తున్నామని ఆమె వెల్లడించారు. 'సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌తో పాటు మంత్రులందరం కాన్వాయ్ వెహికల్‌లను తగ్గించాం. అవకాశం ఉంటే పోలీసులంతా ఒకే వెహికల్లో వెళ్లే యోచన కూడా చేస్తాం. పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుంది. అందుకే ప్రజా ప్రతినిధులంతా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ సైకిళ్లు తొక్కుతున్నాం' అని ఆమె తెలిపారు. పెట్రోల్, డీజిల్, బంగారం లాంటివి కొనుగోలు తగ్గించడం వల్ల విదేశీ మారక నిల్వలు పెరుగుతాయి. డాలర్‌తో రూపాయి విలువ తగ్గుతుంది. ఈ విషయాలను ప్రజలందరూ గమనించి పెట్రోల్, డీజిల్ వాడకాలు తగ్గించాలి. సైకిల్ తొక్కాలి అందరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి' అని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.

## తిరుమలలో మొక్క నాటిని కేంద్రమంత్రి

### శ్రీవారిని దర్శించుకున్న పీయూష్ గోయల్

**తిరుమల,**

ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా తిరుమలలోని శ్రీకృష్ణ అతిథి గృహం వద్ద కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ మొక్క నాటారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. శ్రీవారి దర్శనం అద్భుతంగా జరిగిందన్నారు. ప్రతి ఏటా జూన్ మాసంలో పుట్టినరోజు సందర్భంగా స్వామి వారిని దర్శించుకొని ఆశీస్సులు పొందుతున్నట్లు తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాడు తన తల్లి పేరిట తిరుమలలో మొక్క నాటడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు నేడు ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు. చిన్న పిల్లలు కూడా తమ తల్లి పేరిట ఒక మొక్క నాటాలన్నారు. తిరుమలలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ అద్భుతంగా ఉందని కేంద్ర మంత్రి కొనియాడారు. దర్శన గణంకాలతో పాటు తిరుమలలో టీటీడీ భక్తులకు కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను ఇక్కడి నుంచే పర్యవేక్షించడం అద్భుతమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ ఆదేశాలతో అత్యాధునాతన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను100 రోజుల్లోనే టీటీడీ ఏర్పాటు చేయడం హర్షణీయమని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. ఈరోజు(శుక్రవారం) ఉదయం కేంద్ర మంత్రి తిరుమల శ్రీవారి అభిషేక సేవలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## వైభవంగా శ్రీకళ్యావణ వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

### శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహణ

**తిరుపతి,**

తిరుపతి సమీపంలోని నారాయణవనంలోని శ్రీ పద్మావతి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం చక్రస్నానం వైభవోపేతంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ దివ్య ఘట్టాన్ని దర్శించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు భక్తి పారవశ్యంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి అనుగ్రహాన్ని పొందారు. అంతకుముందు ఉదయం 7 గంటల నుండి 8.15 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం పుష్కరిణి సమీపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారికి, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9.15 గంటల నుండి 10.30 గంటల వరకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకాలు నిర్వహించి విశేష పూజలు చేశారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో జరిగిన అన్ని సేవలు సఫలమై, లోకక్షేమం, సకాల వర్షాలు, ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాల కోసం చక్రస్నానం




నిర్వహించినట్లు ఆగమ పండితులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొని చక్రస్నానాన్ని దర్శించిన భక్తులు సమస్త పాప విముక్తులై, ఐశ్వర్యాలు, ధనధాన్య సమృద్ధిని పొందుతారని విశ్వాసం. రాత్రి 7 గంటల నుండి 8 గంటల వరకు ధ్వజావరోహణం నిర్వహించి తొమ్మిది రోజుల పాటు వైభవంగా సాగిన బ్రహ్మోత్సవాలకు పూర్ణాహుతి పలుకనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, చెంగల్రాయులు, అర్చకులు, అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ వరకు సైకిల్ సవారీ

### ఆంధ్రా వర్సిటీలో మొక్కలు నాటిన బాబు

**విశాఖపట్నం**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలుగుదేశం నేతలు ఉత్సాహంగా సైకిలెక్కారు. చంద్రబాబు సహా నేతలంతా సైకిల్ తొక్కి పర్యావరణాన్ని ప్రచారం చేశారు. విశాఖలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. ఐదున్నర కిలో మీటర్ల దూరాన్ని 21 నిమిషాల 18 సెకండ్లలో చేరుకున్నారు. విశాఖ ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ వరకు సీఎం సైకిల్ సవారీ చేశారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, పోలమాంబ గుడి, వాల్తేరు, బీచ్ రోడ్ మీదుగా నోవాటెల్‌కు ముఖ్యమంత్రి చేరుకున్నారు. ఎర్రటి ఎండ కాస్తున్నా ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. సైకిల్ తొక్కుతూ ప్రజలకు అభివాదం చేసుకుంటూ సీఎం సైకిల్ ప్రయాణం సాగింది. సైకిల్ ర్యాలీలో సీఎం చంద్రబాబు వెంట జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు ఉన్నారు. శ్రీకాకుళంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, విజయవాడలో హోంమంత్రి అనిత కూడా సైకిలెక్కారు. విశాఖ ఏయూ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ మొక్కని నాటారు. తిరుమలలో గ్రీనరీ త్వరలో 90 శాతానికి చేరుకోబోతోందని ఈ సందర్భంగా సీఎం అన్నారు. విశాఖ ఏయూలో మాత్రం కేవలం 25 శాతం మాత్రమే గ్రీనరీ ఉందని.. గ్రీనరీ పెంచేలా చర్యలు తీసుకోవాలని ఏయూ వీసీకి



ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. మొక్కలు బాగా పెంచిన వాళ్లకే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లంటూ చంద్రబాబు సరదా వ్యాఖ్యానించారు. ఆంధ్రా యూనివర్సిటీని ఆదర్శంగా తయారు చేయాలని అన్నారు. చరిత్ర గల యూనివర్సిటీ.. ఎంతోమంది నాయకులు, విద్యావేత్తలు, ప్రముఖులను అందించిందని తెలిపారు.

నెట్ జీరో కాన్సెప్ట్‌ను ఏయూలో ప్రవేశపెడుతున్నట్లు సీఎం చెప్పారు. వాతావరణ మార్పులపై అందరూ దృష్టి సారించాలన్నారు. యూనివర్సిటీకి కావాల్సిన 100శాతం విద్యుత్ ఇక్కడి నుంచే ఉత్పత్తి చేయాలన్నారు. యూనివర్సిటీ క్యాంపస్‌లో చెట్లను పెంచాలన్నారు. పిల్లలకు ఎక్స్‌పీరియన్స్ సెంటర్లుగా యూనివర్సిటీలను మార్చాలన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో కమిటీ ఆఫ్ ప్రొఫెసర్స్‌ను పెట్టి ఇన్‌హౌస్ నాలెడ్జీని అభివృద్ధి చేయాలని అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ అన్ని ఇతర కాలేజీలను గైడ్ చేయాలన్నారు. యూనివర్సిటీ అభివృద్ధికి బ్లూ ప్రింట్ తయారుచేస్తామని తెలిపారు. యాక్షన్ ఎ÷-లాన్‌లో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. లెక్చరర్స్, స్టూడెంట్స్ అందరూ ఇందులో భాగస్వామ్యం కావాలన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా తాను కూడా సైకిల్ మీద వెళ్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. ఫొటోల కోసం కాదని.. ఒక అలవాటు కావాలనే ఉద్దేశంతోనే సైకిల్‌పై వెళ్తున్నట్లు తెలిపారు. సైకిల్ తొక్కడం వలన ఎక్సర్సైజ్, ఫిట్నెస్ రెండూ అవుతాయన్నారు. ఏపీలో 33శాతం గ్రీన్ కవర్ ఉందని.. దీన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యమన్నారు. నెట్ జీరో తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా మని.. దీన్ని ఒక ఆదర్శంగా చేస్తామని సీఎం అన్నారు. నెట్ జీరో కార్యక్రమంలో భాగంగా సైకిల్‌పై నోవాటెల్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు వెళ్లారు.

## సర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలి

### కూటమి నేతలతో సమన్వయం చేసుకుని సాగాలి

### మన ఓట్లు తీసేందుకు గొడ్డలి పార్టీ కుట్ర చేసే యత్నం

### ప్రతి ఒక్కరూ సైతికిల్ వాడాలి..నేరుగా ప్రజలను కలవాలి

### పని చేయని వారిని నిర్మొహమాటంగా పక్కన పెట్టేస్తా

### ఎస్ఐఆర్‌పై వర్క్ షాప్‌లో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

**అమరావతి,**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెదేపా ఎమ్మెల్యేలకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. జనసేన, భాజపాతో కలిసి సమన్వయం చేసుకొని 'సర'ని పర్యవేక్షించాలన్నారు. తెదేపా ప్రధాన పార్టీగా ఉన్నందున పూర్తి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. 'సర్'పై తెదేపా ఎమ్మెల్యేలకు చంద్రబాబు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఎస్ఐఆర్‌పై వర్క్ షాప్‌లో ఏపీ సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. శిక్షణ తరగతులకు హాజరుకాని నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 2002 తర్వాత ఓటర్ల జాబితా సవరణ జరుగుతోంది. మన ఓట్లు తీసేసి.. వాళ్ల ఓట్లు పెట్టేలా కుట్రలకు గొడ్డలి పార్టీ వెనుకాడదు. 'సర్' సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. మాకేం సంబంధం లేదన్నట్లుగా ఎంపీలు ఉంటే సరికాదు. జులై 14 లోపు ఓట్లు ఉండేలా చూసుకోకపోతే ఇబ్బందులు ఎదురవుతాయి. పార్టీ ఉంటేనే ప్రభుత్వం వస్తుందనే బాధ్యతతో ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. సైకిల్ పవర్ చూపించేందుకు ప్రతి ఒక్కరూ ఎలక్ట్రిక్ సైకిల్ వాడండి. దీని వల్ల ఖర్చు సున్నా.. ఆరోగ్యానికి ఆరోగ్యం. ఎలక్ట్రిక్ సైకిల్‌పై వీలైనన్ని ఎక్కువ ఇళ్లకు తిరుగుదాం. ఈ నెల 4న ఎన్డీయే సమావేశం తర్వాత భవిష్యత్ కార్యాచరణ చేపడతాం. 2024లో కూటమికి వచ్చిన ఓట్ల కంటే వచ్చే ఎన్నికల్లో పెరగాలి. ప్రతి బుధవారం పార్టీ క్యాలెండర్ తప్పనిసరిగా అమలు కావాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ఎన్డీఏ సమన్వయ కమిటీల నియామకం జరగనున్నట్లు



చంద్రబాబు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో మిత్రపక్షాలను కలుపుకువెళ్లాలని.. బలం ఎక్కువా తక్కువా అనేది అనవసరమని, అటువంటి ఆలోచనలు కూడా పెట్టుకోవద్దన్నారు. కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందేనని ఎమ్మెల్యేలకు సీఎం స్పష్టం చేశారు. ఈ నెల 4న ఎన్డీఏ నేతల సమావేశం జరగనుందని తెలిపారు. జెండా మోయాలంటే జెండా ద్వారా వచ్చిన అధికారంలో కార్యకర్తలను భాగస్వామ్యులను చేయాల్సిందే అని చెప్పారు. పదవి ఎవరికీ శాశ్వతం కాదని.. పనిచేసినంత కాలం పదవికి ఢోకా ఉండదని సీఎం అన్నారు. పని చేయకపోతే నమస్కారం పెట్టి ఎటువంటి మొహమాటం లేకుండా పక్కనపెట్టేస్తానని తేల్చిచెప్పేశారు. ఎవరూ వన్ టైం ఎమ్మెల్యేగా మిగిలిపోవద్దన్నారు. అమెరికన్ డెమోక్రసీలో రెండు సార్లు మాత్రమే ఎన్నికయ్యేందుకు అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. 'మన దగ్గర ప్రజలు మెచ్చినంత కాలం మనం ఎమ్మెల్యేగా ఉండవచ్చు. ఎమ్మెల్యేల ప్రవర్తన బాగుంటే.. ఓట్లు పడతాయి.. ప్రజలు ఆదరిస్తారు. ఎమ్మెల్యేల ప్రవర్తన బాగోలేకపోతే ఓట్లు పోతాయి.. ఆ విషయం అందరూ గుర్తుపెట్టుకోవాలి. పనిచేయకపోయినా పర్వాలేదు.. నోరు మాత్రం పారేసుకోవద్దు. తస్మాత్... జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్యేలను చంద్రబాబు హెచ్చరించారు.

## భవిష్యత్యం అవసరాలకు పెట్టుబడి

### గూగుల్ తీరును అభినందించన ఉదయ్ కోటక్

**ముంబై,**

కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కోటక్ తాజాగా భారతీయ వ్యాపార సంస్థలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ దిగ్గజ కార్పొరేట్ సంస్థలు వేల కోట్లను ఆర్జిస్తున్నప్పటికీ సంతృప్తి చెందకుండా భవిష్యత్తుపై పెట్టుబడులు పెడుతున్న వైనాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా గూగుల్ గురించి ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఈ సంస్థ ఆర్థిక సామర్థ్యం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోందని అన్నారు. 'గూగుల్ వార్షిక లాభం 160 బిలియన్ డాలర్లు. గత త్రైమాసికంలో 62 బిలియన్‌లను ఆర్జించింది. సంస్థ మార్కెట్ విలువ 4.5 ట్రిలియన్‌లు. భారతీయ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్, లాభాల కంటే ఇది ఎక్కువ. ఇది భారతీయ కంపెనీలకు మేలు కొలుపు కావాలి. ప్రస్తుత పరిస్థితి ఎంత మెరుగ్గా ఉన్నప్పటికీ భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టాలి' అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ పోస్టు నెట్టింట తెగ వైరల్ అవుతోంది. కృత్రిమ మేధపై పెట్టుబడుల కోసం ఇటీవల గూగుల్ ఏకంగా 80 బిలియన్ డాలర్లను సేకరించేందుకు ప్రణాళిక ఆవిష్కరించింది. ఇది ప్రపంచవ్యాప్తంగా సంచలనాన్ని సృష్టించింది. ప్రభుత్వాలు నిధుల సేకరణ జరిపే స్థాయిలో ఒక కార్పొరేట్ కంపెనీ దీర్ఘకాలిక వ్యూహంతో నిధులు సేకరించడంతో పెద్ద చర్చుకు దారి తీసింది.

## మేలో భారీగా తిరుమల లడ్డూ విక్రయాలు

### మొత్తం 1.21 కోట్ల లడ్డూలను విక్రయించినట్లు వెల్లడి

**తిరుమల,**

ఈ ఏడాది మే నెలలో శ్రీవారి లడ్డూ ప్రసాదం విక్రయాలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. భారీగా భక్తులు తరలి ర ఆవడంతో ఆదాయంతో పాటు, లడ్డూ విక్రయాలు కూడా పెరిగాయి. మొత్తం 1.21 కోట్ల లడ్డూలను విక్రయించినట్లు తితిదే వెల్లడించింది. 2024 మే నెలలో 1.01 కోట్లు, 2025 మే నెలలో 1.10 కోట్ల లడ్డూలను విక్రయించగా.. ఈసారి సంఖ్య మరింత పెరిగింది. రోజుకు సగటున 4.08 లక్షల లడ్డూలను తయారు చేసింది. లడ్డూల తయారీకి తితిదే రోజువారీగా 68 టన్నుల ముడి పదార్థాలను వినియోగిస్తోంది. ఇటీవలి కాలంలో శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యత, రుచి మరింత మెరుగుపడటంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత, సంప్రదాయం, భక్తి భావనల సమ్మేళనంగా నిలిచే శ్రీవారి లడ్డూ ప్రసాదం తిరుమల మహత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటి చెబుతోంది.

## జనసేనకు భారీ షాక్..

### హౌస్ మోషన్ పిటిషన్ తిరస్కరణ

**హైదరాబాద్,**

హైదరాబాద్‌లో ఇవాళ సభ పెట్టాలనుకున్న జనసేనకు హైకోర్టులో షాక్ తగిలింది. హైకోర్టులో వేసిన హౌస్ మోషన్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఇవాళ మధ్యాహ్నం బహిరంగ సభ పెట్టాలని జనసేన అనుకుంది. ఇందుకు ఉదయం పిటిషన్ వేసింది. ఐతే.. హైకోర్టు.. పిటిషన్‌పై విచారణకు టైమ్ లేదనీ.. ఇంత సడెన్‌గా విచారణ అంటే కష్టమని అభిప్రాయపడింది. పోలీసుల అభ్యంతరాలను తెలుసుకున్న హైకోర్టు.. పిటిషన్‌ని కొట్టివేసింది. ఐతే.. సాయంత్రం పవన్ కళ్యాణ్ జూబ్లీహిల్స్ లోని తన ఇంట్లో పెట్టే ప్రెస్ మీట్‌కి మాత్రం అనుకూల పరిస్థితులు ఉన్నాయి. కాబట్టి.. సభకు సంబంధించి జనసేన నెక్స్ మరో తేదీ ఏదైనా నిర్ణయించుకునే ఛాన్స్ ఉంటుంది. హైదరాబాద్‌లో ఇవాళ తెలంగాణ నవ నిర్మాణ సేన పేరుతో సభ పెట్టుకోవాలని జనసేన పార్టీ అనుకుంది. ఐతే.. భద్రతా కారణాలు, ట్రాఫిక్ ఇతరత్రా కారణాలతో పోలీసులు ఈ సభకు అనుమతించలేదు. ఇదే విషయాల్ని హైకోర్టుకు కూడా చెప్పారు. చివరకు హైకోర్టు పోలీసుల వాదనకే మొగ్గు చూపింది. అందువల్ల జనసేన పిటిషన్‌పై విచారణ జరగకుండానే.. దాన్ని కొట్టేసినట్లైంది. ఇది జనసేనకు ఒక ఎదురుదెబ్బ లాంటిదే కాబట్టి.. ఇవాళ సాయంత్రం పవన్ కళ్యాణ్ ఎలా స్పందిస్తారు? ప్రెస్‌మీట్‌లో ఏం చెబుతారనేది ఆసక్తిగా మారింది.

PRGI NO: TGTEL/25/A5314
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

# అక్కడ చమురు ధరలు పైపైకి ఇక్కడ భారాలు ప్రజలపైకి

పశ్చిమాసియాలో సాగు తున్న యుద్ధంతో ప్రపంచ ముడి చమురు ధరలు బ్యారెల్‌కు వంద డాలర్ల మార్కు దాటేసింది. దేశంలో కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీలకు ఎన్నికలు జరుగు తూ వుండడంతో మోడీ ప్రభుత్వం ఆ ఎన్నికలు పూర్తయ్యేంత వరకూ పెట్రోల్, గ్యాస్ ధరలను పెంచకుండా నిలుపుజ్జుసింది. ఎన్నికలు పూర్తి కాగానే ఇప్పటికి మూడు రౌండ్లు పెట్రో ధరలను పెంచింది. ఇంక ముందు కూడా పెంచుతుందని గట్టిగా చెప్పవచ్చు. కేవలం బిజెపి సమర్థకులే గాక, అనేకమంది ఆర్థికవేత్తలు ఈ విధంగా ప్రజలపైకి పెరిగిన చమురు భారాలను నెట్టడం అని వార్యంగా జరగవలసిన సహజమైన చర్యగా పరిగణిస్తున్నారు. మన దేశ ఆర్థిక వ్యవస్థ నడక తీరు గురించిన వారి అవగాహన లోపభూయిష్టంగా ఉండడం వల్లే వారావిధంగా పొరపాటు పడుతున్నారు. ప్రాథమికమైన విషయం ఏమంటే పెట్రో ఉత్పత్తుల డిమాండ్ వాటి ధరలు పెరిగేటప్పుడు తగ్గేదీ కాదు, తగ్గినప్పుడు వాటి డిమాండ్ పెరిగేదీ కాదు. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగినప్పుడు వాటి వినియోగదారులు వేరే సరుకుల కొనుగోలు తగ్గించి పెట్రో ఉత్పత్తులను కొనుగోలు చేస్తారు. అందుచేత పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగినప్పుడు వాటి డిమాండ్ తగ్గిపోదు కాని వేరే ఇతర సరుకుల డిమాండ్ పడిపోతుంది.దాని ఫలితంగా ఆర్థిక వ్యవస్థ మాంద్యం దిశగా అడుగులు వేస్తుంది. చమురు ఉత్పత్తుల సరఫరా ఎంతగా తగ్గితే అంతగా వాటి ధరలు పెరుగుతాయి. తగ్గిపోయిన సరఫరాకు తగ్గట్టు వాటి డిమాండ్ తగ్గిపోవాలంటే అంత ఎక్కువగా వాటి ధరలు పెరగాలి. అప్పుడు ఆర్థిక వ్యవస్థ అంత తీవ్రంగా మాంద్యంలో కూరుకుపోతుంది. అయితే, ఎక్కువ సందర్భాల్లో చమురు ధరలు పెరగడం అనేది దాని సరఫరా తగ్గినందువలన సంభవించేది కాదు. నిజానికి ఇప్పుడు ఒకవైపు యుద్ధం కొనసాగుతున్నా, చమురు నిల్వలు సరఫరాను కొనసాగించగల స్థాయిలోనే ఉన్నాయి. చమురు నిల్వలకు కొరత ఏర్పడబోతుందన్న అంచనాలు, దానివలన ధరలు పెరగనున్నాయన్న అంచనాలు వచ్చి వాస్తవ చమురు ధరల పెరుగుదలకు దోహదం చేస్తాయి. అయితే, మనం ప్రస్తుతం వాస్తవంగానే చమురు సరఫరా తగ్గిందని, దానివల్లే అంతర్జాతీయ ధరలు పెరిగాయని వాదన కోసం అంగీకరిద్దాం.ఈ విధంగా ప్రపంచ చమురు ధరలు పెరిగినప్పుడు ఏ దేశంలోనైనా అనుసరించగల విధానాలు రెండు విధాలుగా ఉంటాయి. మొదటిది: దేశంలో పెట్రో ఉత్పత్తుల ధరలను, వాటిని ఉపయోగించి తయారు చేసే ఇతర ఉత్పత్తుల ధరలను పెరగనివ్వడం. ధరల పెరుగుదల. మాంద్యం కారణంగా ఆ ఉత్పత్తుల డిమాండ్ తగ్గిపోయి, తగ్గిన చమురు సరఫరాలకు తగినట్టు సర్దుబాటు కావడం ఒక విధానం.ఈ విధానం వలన ఆర్థిక మాంద్యం అనివార్యంగా ఏర్పడుతుంది. వాస్తవానికి ఆర్థిక మాంద్యం వల్లే చమురు సరఫరాకు, డిమాండ్‌కు మధ్య సమతూకం ఏర్పడుతుంది. ఇక రెండవ విధానం: దేశీయంగా చమురు ఉత్పత్తుల ధరలను పెంచకుండా ఉండడం, పెట్రో ఉత్పత్తుల సరఫరాను రేషనింగ్ ద్వారా నియంత్రించడం. అందువలన ఇతర సరుకుల వినిమయం కోసం చేసే ఖర్చు దారి మళ్ళకుండా యథాతథంగా కొనసాగుతుంది. అందువలన ఆర్థిక మాంద్యం ఏర్పడదు. ఈ రేషనింగ్‌ను అమలు చేసేటప్పుడు పెట్రో ఉత్పత్తులను ముడిసరుకులుగా వాడే పరిశ్రమలకు సరఫరా కోత పెట్టకుండా కొనసాగించాలి. ప్రధానంగా సంపన్న వర్గాల వినియోగాన్ని నియంత్రించాలి. పెట్రో ఉత్పత్తుల సరఫరాను రేషనింగ్ చేసినందువలన వాటి కోసం చేయవల సిన ఖర్చు వేరే ఇతర, దేశీయంగా ఉత్పత్తి అయ్యే సరుకుల వినిమయం కోసం ఖర్చు అవుతుంది. అందువలన దేశీయంగా ఆ సరుకుల డిమాండ్ పెరుగుతుంది. అది ఉపాధి కల్పనకు దారి తీస్తుంది. అందుచేత మొదటి విధానం ఆర్థిక మాంద్యా నికి దారి తీస్తే, రెండో విధానం మరింత ఎక్కువ ఉపాధి కల్పనకు, ఉత్పత్తి పెరుగుదలకు దారి తీస్తుంది.ఇలా చెప్పడం మొదట విడ్డూరంగా అనిపించవచ్చు.ప్రపంచ చమురు ఉత్పత్తులు తగ్గిపోయి, చమురు దిగుమతి తగ్గిపోతే ఆ దేశంలో ఉత్పత్తి ఎలా పెరుగుతుంది? ఉపాధి ఎలా పెరుగుతుంది? అన్న సందేహాలు వస్తాయి. చమురు దిగుమతులు తగ్గినప్పుడు ఆ ప్రభావం వలన వినిమయం కూడా తగ్గిపోయి, ప్రత్యామ్నాయాల వైపు దృష్టి మళ్ళి దేశీయ ఉత్పత్తుల కోసం డిమాండ్ పెరుగుతుందని గ్రహించగలిగితే, దేశ ఆర్థిక వ్యవస్థ మీద ఈ విధానం కలిగించగల బహుళ ప్రభావాలు విదిత మౌతాయి. మరి ప్రపంచవ్యాప్తంగా చమురు




ధరలు పెరిగినప్పుడు దేశీయంగా పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచకపోతే ఆ పెట్రో ఉత్పత్తులను దేశీయంగా ఉత్పత్తి చేసేవారు. పంపిణీ చేసేవారు నష్టపోతారు కదా. అప్పుడేం చేయాలి? ఆ నష్టాన్ని ప్రభుత్వం సబ్సిడీ ద్వారా భరించవచ్చు. ఆ మేరకు బడ్జెట్‌లో ద్రవ్య లోటును పెంచవచ్చు. ఆ బడ్జెట్ లోటు పెరగడం పెద్ద సమస్యేమీ కాదు. ప్రపంచ చమురు ధరలు ఇరవై శాతం పెరిగా యనుకుందాం. అప్పుడు దేశంలోకి దిగుమతయ్యే చమురు పది శాతం తగ్గిపోయిందను కుందాం. అప్పుడు చమురు దిగుమతులకు మనం డాలర్ల రూపంలో చెల్లించవలసినది ఎనిమిది శాతం పెరుగుతుంది.ఈ అదనపు విదేశీ మారక ద్రవ్యాన్ని ఎలాగో ఒకలాగ పోగేయాల్సిందే. ఒకవేళ మన దగ్గరున్న డాలర్ నిల్వల నుండి విడుదల చేశారనుకుందాం. అప్పుడు మొదటి విధానాన్ని అమలు చేస్తే, పెట్రో ఉత్పత్తుల ధరలు పెరుగుతాయి.

# వైరస్ సోకిన వీధి కుక్కలకు ప్రత్యేక చికిత్సలు

**- బ్లూ క్రాస్ పర్యవేక్షణలో 194 కుక్కలకు వైద్య సేవలు**

**- మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది**



వైరస్ సోకిన వీధి కుక్కలను గుర్తించి చికిత్సలు అందించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినట్లు మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని 25వ వార్డు ముత్యాలమ్మ గుడి సమీపంలో బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ షెల్టర్ డైరెక్టర్, సిఎఫ్ఓ ఎన్ఎస్ కె కుమారి, బ్లూ క్రాస్ వ్యవస్థాపకురాలు అక్కినేని అమల ఆదేశాల మేరకు సూర్యాపేట జిల్లా బ్లూ క్రాస్ వాలంటీర్ ఆధ్వర్యంలో వైరస్ సోకిన కుక్కలకు వైద్య చికిత్సను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల మెంజ్ వైరస్ సోకి చర్మవ్యాధులతో బాధపడుతున్న వీధి కుక్కల చికిత్సకు బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ వ్యవస్థాపకులు అక్కినేని అమల వీధి కుక్కల చర్మవ్యాధులు, ప్రజల్లో నెలకొన్న ఆందోళనపై స్పందించి వైరస్ సోకిన కుక్కలకు వైద్య చికిత్సలు అందించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. పట్టణంలో ఇప్పటివరకు 194 వైరస్ సోకిన కుక్కలను గుర్తించగా వాటి చికిత్స కోసం సుమారు రూ.1.80 లక్షల విలువైన ఇంజెక్షన్లు, మందులను హైదరాబాద్ నుంచి సూర్యాపేటకు పంపించారని జిల్లా బ్లూ క్రాస్ వాలంటీర్, కాంగ్రెస్ నాయకుడు నరేందర్ నాయుడు ఈ మందులను జిల్లా కేంద్రానికి తీసుకువచ్చారని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన బ్లూ క్రాస్ వాలంటీర్లు లాలు, నరేష్ ప్రత్యేక వైద్య బృందంతో కలిసి కుక్కలకు చికిత్స అందించినట్లు తెలిపారు. శనివారం నుంచి పట్టణంలోని 48 వార్డులలో వైరస్ సోకిన కుక్కలను గుర్తించి దశలవారీగా వైద్య చికిత్సలు అందించనున్నట్లు తెలిపారు. ఇటీవల బ్లూ క్రాస్ బృందం ప్రత్యేక వలల సహాయంతో చర్మవ్యాధులతో బాధపడుతున్న కుక్కలను పట్టుకుని వాటి రక్త నమూనాలను సేకరించి పరీక్షా ఫలితాల ఆధారంగా తదుపరి కార్యాచరణ చేపడతారని పేర్కొన్నారు. ప్రస్తుతం బాధిత కుక్కలకు అవసరమైన వ్యాక్సిన్లు, మందులు అందజేస్తూ చికిత్స కొనసాగిస్తున్నట్లు తెలిపారు. వీధి కుక్కలను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించడం సమస్యకు శాశ్వత పరిష్కారం కాదని, జంతు జనన నియంత్రణ కార్యక్రమాలు, రేబిస్ నిరోధక టీకాలు, వైద్య చికిత్సల ద్వారానే సమస్యను సమర్థవంతంగా నియంత్రించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హన్మంతరెడ్డి, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, వార్డు కౌన్సిలర్ కోడి శిరీష శివ, నాయకులు గుంటి సైదులు, అక్కినపల్లి జానయ్య, యాట వెంకన్న, పొలాగాని కృష్ణ, నరేందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనలో మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయి గౌరవం

**- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనలో సూర్యాపేట మున్సిపాలిటీ రాష్ట్రస్థాయిలో విశేష గౌరవాన్ని దక్కించుకుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని 16వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో జిల్లా ఎస్పీ నరసింహ, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్యదిలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణ ప్రగతి, పారిశుధ్యం, ఓటరు నమోదు తదితర అంశాలపై ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. సూర్యాపేటను ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా మార్చేందుకు వినూత్న ప్రయోగాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల భాగస్వామ్యం, శానిటేషన్ (పారిశుధ్య) సిబ్బంది కష్టం వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆయన అభినందించారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం దేశంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ చట్టం అమల్లోకి వచ్చిందని గుర్తుచేశారు. ఈ నిబంధనల ప్రకారం తడి చెత్త మరియు పొడి చెత్తను విడివిడిగా సేకరించాలని, వీటితో పాటు శానిటరీ వేస్ట్ కూడా వేరు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బయో మెడికల్ వ్యర్థాలను ప్రత్యేకంగా విభజించాలనే రూల్స్ వచ్చాయని ఈ నియమాలను పక్కాగా అమలు చేయడంలో సూర్యాపేట మున్సిపాలిటీ రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉందని, భవిష్యత్తులో పారిశుధ్య విభాగంలో మరిన్ని జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు సాధిస్తుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. వార్డుల్లోని ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. పట్టణంలో ఇబ్బందిగా మారిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) సమస్యపై ఆయన తీవ్రంగా స్పందించారు. సంబంధిత ఏజెన్సీ అధికారులను పిలిపించి, పనులు త్వరగా పూర్తి చేయాలని, లేదంటే కఠిన చర్యలు ఉంటాయని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చినట్లు వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "99 రోజుల ప్రజా పాలన ప్రగతి నివేదిక" కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో విస్తృతంగా చైతన్యం కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజలకు అత్యంత ఆవశ్యకమైన విద్య, వైద్యం, శాంతి భద్రతల పరిరక్షణ, మహిళా అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలను అధికారులు నేరుగా గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీల్లోని ప్రజల వద్దకే తీసుకెళ్తున్నారని చెప్పారు. ప్రజలతో మమేకమై ప్రభుత్వ పథకాలను ముందుకు తీసుకెళ్లేందుకు యంత్రాంగం శ్రమిస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ప్రస్తుతం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### మహిళల భద్రతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు..

### 'డయల్ 100'కు పిలిస్తే ఇంటికే పోలీస్: జిల్లా ఎస్పీ నరసింహ

రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఎక్కడైనా మహిళల రక్షణకు ఇబ్బందులు ఎదురైతే పోలీస్ శాఖ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ స్పష్టం చేశారు. మహిళల వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, వరుసగా నేరాలకు పాల్పడితే అలాంటి వారిపై రౌడీ షీట్ ఓపెన్ చేసి ప్రత్యేక నిఘా ఉంచుతామని ఆయన హెచ్చరించారు. మహిళలు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా నేరుగా డయల్ 100లేదా 112నంబర్లకు కాల్ చేయవచ్చన్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులే నేరుగా బాధితుల వద్దకు వచ్చి, అక్కడికక్కడే కేసు నమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతూ, నేరస్థులకు కఠినంగా శిక్ష పడేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్పర్సన్ షఫీ ఉల్లా, డిఎస్పీ ప్రసన్నకుమార్, తహసిల్దార్ కృష్ణయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, వార్డ్ కౌన్సిలర్ షేక్ జహీర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, డాక్టర్ అమూల్య, కిరణ్ కుమార్, అధికారులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అధికార పార్టీ దౌర్జన్యాలకు సూర్యాపేట ఘటనే నిదర్శనం

**- టీఆర్పి జిల్లా అధ్యక్షుడు మామిడి అంజయ్య**

అధికార పార్టీ రాష్ట్రంలో పాల్పడుతున్న దౌర్జన్యాలకు సూర్యాపేటలో టిఆర్ పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య అరెస్టు ఘటనే నిదర్శనమని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షులు మామిడి అంజయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో శు క్రవారం జరిగిన ఘటన అధికార పార్టీ అహంకారానికి ప్రతీక అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రాజ్యం కోసం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల న్యాయం కోసం నిరంతరం పోరాడుతున్న వట్టే జానయ్య యాదవ్‌పై అధికార పార్టీ నాయకులు కుట్రపూరితంగా దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. గత 12 ఏళ్లుగా జరుగుతున్న వజ్ర టౌన్ షిప్ వాస్తవాలు సూర్యాపేట ప్రజలందరికీ తెలుసని పేర్కొన్నారు. నల్లు ఉమ జ్యోతి రెడ్డి నుండి ప్లాట్ కొనుగోలు చేస్తే పాస్ బుక్‌లో ఉన్న భూమి కంటే రిజిస్ట్రేషన్ చేసిన భూమి తక్కువగా ఉందని, తాము మోసపోయామని సదరు మహిళ పై భాదితులు ఫిర్యాదు చేస్తే, న్యాయం చేయాల్సిన పోలీసులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితురాలు ప్రస్తుతం అమెరికాలో ఉంటున్నారనే సాకుతో, పోలీసులు అసలు నిందితులను అరెస్ట్ చేయకుండా కేసును పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఇప్పటికే వట్టే జానయ్య యాదవ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు గుర్తు చేశారు. వజ్ర టౌన్ షిప్ లో పేద ప్రజలను అక్కడి నుండి వెళ్లగొట్టాలనే కుట్రతో, ఆ భూమిని వేరే వారికి రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ విషయం తెలిసి బాధితురాలికి అండగా నిలబడటానికి వట్టే జానయ్య అక్కడికి వెళ్లగా.. పోలీసులు అధికార పార్టీ నాయకుల ఇళ్ల నుండి వచ్చి, అక్రమార్కులకు బందోబస్తు ఇచ్చి మరీ రిజిస్ట్రేషన్ చేయించారని వాపోయారు. సబ్ రిజిస్ట్రార్‌ను సైతం బెదిరించి, ఒత్తిడి తెచ్చి అక్రమంగా రిజిస్ట్రేషన్ పూర్తి చేయించడంలో పోలీసుల తీరు అత్యంత దారుణంగా ఉందని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. టిఆర్పీ అధినేత తీన్మార్ మల్లన్న ఎల్లప్పుడూ బాధితుల పక్షాన పోరాడుతుంటారని, ఈ అక్రమాలపై కూడా వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేశారు. అధికార పార్టీ ఒత్తిళ్లకు, ప్రలోభాలకు లొంగి పోలీసులు బాధ్యతారహితంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదన్నారు. బాధితులకు న్యాయం జరగకపోతే త్వరలోనే బాధ్యులైన నాయకుల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఇలాంటి బెదిరింపులకు భయపడే వారు ఎవరూ ఇక్కడ లేరని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ప్రజల తరపున గట్టిగా ఎదురిస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో టి ఆర్ పి పట్టణ అధ్యక్షుడు కుంభం నాగరాజు, సూర్యాపేట మండల అధ్యక్షుడు సోమ గాని లింగస్వామి గౌడ్, కుంభ వెంకన్న, నేలచర్ల మధు ప్రజాపతి, బోడపట్ల మధు గౌడ్, చింతకాయల జానయ్య, మామిడి శోభన్ గౌడ్, కాంటేకార్ రఘుమోహన్, వట్టే లింగరాజు, వట్యాల శేఖర్, చాంప్లా, సాయి, గుంటూరు విజయ్, రాగం లింగయ్య, మంద లింగరాజు, తదితరులు పాల్గొన్నారు.



# నీట్ పరీక్ష, ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సమీక్ష

రాష్ట్రంలో జూన్ 21న జరగనున్న నీట్ (జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష) ను ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శనివారం ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా నీట్ పరీక్ష నిర్వహణ, రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లు, రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి చేయనున్న జిల్లా పర్యటనల ఏర్పాట్లపై సుదీర్ఘంగా సమీక్షించారు. పరీక్షా రోజున విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్లకు సీఎస్ సూచించారు. వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జొంగ్తు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 24 నగరాల్లోని 208 కేంద్రాల్లో సుమారు 72,956 మంది విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, రవాణా, భద్రత, నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీరు తదితర ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్లు వివరించారు. అదనపు డీజీపీ మహేష్ భగవత్ మాట్లాడుతూ, పోలీస్ శాఖ, జిల్లా యంత్రాంగం మధ్య పటిష్ట సమన్వయం ఉండాలని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన



భద్రతను ఏర్పాటు చేయాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులు, తప్పుడు వార్తల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాటిని ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని సూచించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) డీజీ అభిషేక్ సింగ్ మాట్లాడుతూ.. ఈ ఏడాది పరీక్షా విధానంలో భద్రతా ప్రమాణాలను మరింత పెంచినట్లు వెల్లడించారు. పరీక్షా పవిత్రతను కాపాడే క్రమంలో, ప్రశ్నాపత్రాలను తరలించడానికి తొలిసారిగా భారత వైమానిక దళం సేవలను వినియోగిస్తున్నట్లు ఆయన సమావేశం దృష్టికి తెచ్చారు. రాష్ట్రంలో రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోళ్ల విషయంలో కలెక్టర్లు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని, ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం రక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న ప్రాంతాల్లో కొనుగోళ్లను వెంటనే వేగవంతం చేయాలన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ముఖ్యమంత్రి పర్యటనలు ఉన్న నేపథ్యంలో, అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పర్యటనలను విజయవంతం చేయాలని సీఎస్ ఆదేశించారు. బహిరంగ సభలు, భద్రత, రవాణా, బస తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ సీవీ ఆనంద్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ దాన కిషోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, సెర్ప్ సీఈఓ దివ్య, సమాచార, పౌరసంబంధాల శాఖ (ఐ అండ్ పీఆర్) స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సనత్‌నగర్ 'టిమ్స్' ఆసుపత్రి ప్రారంభానికి ముమ్మర సన్నాహాలు



హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన అత్యాధునిక 'టిమ్స్' ఆసుపత్రి త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ నేపథ్యంలో ఆసుపత్రి ప్రారంభోత్సవ ఏర్పాట్లను, వైద్య సేవల సంసిద్ధతను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈరోజు స్వయంగా పర్యవేక్షించి సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలోని ఏ, బీ, సీ బ్లాకులతో పాటు ఓపీ రిజిస్ట్రేషన్, ఇన్‌పేషెంట్ వార్డులు, అత్యవసర విభాగం, ఐసీయూలు, ఆపరేషన్ థియేటర్లు, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, డయాగ్నస్టిక్స్, బ్లడ్ బ్యాంక్, మెకనైజ్డ్ ల్యాండ్రీ, సెంట్రలైజ్డ్ కిచెన్, ఫార్మసీ తదితర విభాగాలను ఆయన పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన అత్యాధునిక వైద్య పరికరాలు, మౌలిక వసతుల నిర్వహణ వ్యవస్థలను పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఆసుపత్రి ప్రారంభోత్సవానికి ముందే పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ అధికారులు సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నీటి సరఫరా, విద్యుత్, పారిశుధ్యం, సెక్యూరిటీ, ఫైర్ సేఫ్టీ వ్యవస్థలను అత్యున్నత ప్రమాణాలతో సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఓపీ కౌంటర్లు, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, హెల్ప్ డెస్కులు, ఫార్మసీ సేవలతో పాటు రోగులు, వారి బంధువులు వేచి ఉండే ప్రాంతాలను మరింత పటిష్టంగా తీర్చిదిద్దాలని సూచించారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ, డిజిటల్ ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ తదితర ఆధునిక యంత్రాలు పూర్తిస్థాయిలో రోగులకు అందుబాటులో ఉండేలా అవసరమైన వైద్యులు, టెక్నీషియన్లు, ఇతర సిబ్బందిని ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, ఆసుపత్రి నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# కలసి ఉంటే కలదు సుఖం: విడిపోయిన కుటుంబాలను ఏకం చేస్తున్న కౌన్సెలింగ్ కేంద్రాలు



కుటుంబంలో ఐక్యతను పెంపొందించడం, వైవాహిక సంబంధాలను బలోపేతం చేయడం మరియు మహిళల భద్రతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో "మీ సురక్ష – కలసి ఉంటే కలదు సుఖం" అనే ప్రత్యేక కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ – ఫ్యామిలీ కౌన్సెలింగ్ కేంద్రాల ద్వారా కౌన్సెలింగ్ పొంది, తిరిగి ఏకమైన సుమారు 150కి పైగా జంటలు, వారి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో సంతోషంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ సభను ఉద్దేశించి మాట్లాడుతూ.. మహిళలు, చిన్నారుల భద్రత, సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం, పోలీసు శాఖ అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని స్పష్టం చేశారు. షీ టీమ్స్, భరోసా కేంద్రాలు, ఉమెన్ పోలీస్ స్టేషన్లు తదితర వ్యవస్థల ద్వారా మహిళలకు పూర్తి రక్షణ కల్పిస్తున్నామన్నారు. భార్యాభర్తల మధ్య పరస్పర గౌరవం, అవగాహన ఉన్నప్పుడే సంతోషకరమైన కుటుంబ జీవనం సాధ్యమవుతుందని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా కౌన్సెలింగ్ మరియు సపోర్ట్ సేవల ద్వారా దాదాపు 6,700 మంది జంటలను తిరిగి ఏకం చేయడంలో కృషి చేసిన కౌన్సెలర్లు, ఎన్జీవోలు, పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు. మహిళా భద్రతా విభాగం డీజీ చారు సిన్హా మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన కుటుంబ సంబంధాలకు పరస్పర నమ్మకం, గౌరవం పునాది అని అన్నారు. ఒకరినొకరు నిందించుకోవడం మాని, ఎదుటివారి కోణాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలని జంటలకు సూచించారు. మహిళలు విద్య, ఉద్యోగ, వ్యక్తిగత లక్ష్యాలను చేరుకునేలా కుటుంబం అండగా నిలవాలని ఆమె స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ హెడ్ ఎస్.ఎన్. శ్రీదేవి ప్రసంగిస్తూ వివాహ వ్యవస్థ పరస్పర గౌరవం, సర్దుబాటుపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. కుటుంబ కలహాలను పరిష్కరించడంలో కౌన్సెలింగ్, మధ్యవర్తిత్వం కీలక పాత్ర పోషిస్తాయన్నారు. తిరిగి ఏకమైన జంటలు తమ అనుభవాలను పంచుకుంటూ, సమాజంలో ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆమె కోరారు. మల్కాజిగిరి సీపీ బి. సుమతి మాట్లాడుతూ తమ కమిషనరేట్ పరిధిలో 8 ఫ్యామిలీ కౌన్సెలింగ్ కేంద్రాలు పనిచేస్తున్నాయని, ఇవి ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 9,700కి పైగా కేసులను స్వీకరించి, 32,000 లకు పైగా కౌన్సెలింగ్ సెషన్లు నిర్వహించామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఏకమైన జంటలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. వారి అనుభవాలను సభలో పంచుకున్న జంటలు, తమను తిరిగి ఏకం చేసిన కౌన్సెలర్లు, పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 'మై ఛాయిస్' ఫౌండేషన్ ప్రతినిధి పెర్ల్ చోరగుడి, ఉమెన్ సేఫ్టీ డీసీపీ టి. ఉషారాణి, ఇతర సీనియర్ పోలీసు అధికారులు, కౌన్సెలర్లు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మీట్ ద ప్రెస్' కార్యక్రమాల పరంపర కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టు ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, ముఖ్యంగా చిన్న దినపత్రికల మనుగడ ప్రశ్నార్థకంగా మారిన తీరును వివరించారు. ఈ సమస్యల పరిష్కారానికి వామపక్షాల సహకారం అందించాలని వారు జాన్ వెస్లీకి విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల విజ్ఞప్తుల పట్ల జాన్ వెస్లీ సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని, వారి ఇతర సమస్యలను పరిష్కరించాలని తమ పార్టీ వేదికల ద్వారా గట్టిగా ప్రస్తావిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రికి స్వయంగా లేఖ రాస్తానని వెల్లడించారు. అలాగే, చిన్న దినపత్రికలకు సంబంధించిన పెండింగ్ బిల్లుల సమస్యను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, ఆ బిల్లులు త్వరగా మంజూరయ్యేలా తమ వంతు కృషి చేస్తామని జాన్ వెస్లీ భరోసా ఇచ్చారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం సీపీఎం ఎప్పుడూ ముందుంటుందని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో చిన్న పత్రికల అసోసియేషన్ అధ్యక్షులు యూసుఫ్ బాబు, వెంటయ్య తదితరులు పాల్గొన్నారు.




# నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేప ప్రసాదం పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు

మృగశిర కార్తె సందర్భంగా ఈ నెల 8న(సోమవారం)నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఆస్తమా రోగులకు పంపిణీ చేయనున్న చేప ప్రసాదం కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు ఈ ప్రసాదం కోసం తరలివచ్చే అవకాశం ఉన్నందున, అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మత్స్య అభివృద్ధి సంస్థ చైర్మన్ మెట్టు సాయికుమార్, సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డిలతో కలిసి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లోని ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. జూన్ 8వ తేదీ రాత్రి 9 గంటలకు చేప ప్రసాదం పంపిణీ ప్రారంభమై, 9వ తేదీ రాత్రి వరకు నిరంతరాయంగా కొనసాగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా క్యూలైన్లలో ఉన్న భక్తుల కోసం ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయాలని, అవి ఎల్లప్పుడూ పనిచేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. త్రాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు వాటర్ ప్రూఫ్ జనరేటర్లను సిద్ధంగా ఉంచాలన్నారు. క్యూలైన్లలో తొక్కిసలాట జరగకుండా పోలీసు అధికారులు



కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం నిఘా ఉంచాలని, నాంపల్లి పరిసరాల్లో ఎలాంటి ట్రాఫిక్ అంతరాయాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లు మరియు సీపీఆర్ బృందాలను క్యూలైన్ల వద్ద అందుబాటులో ఉంచాలని వైద్య అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక యంత్రాలు, సీసీటీవీ కెమెరాలు, షీ టీమ్స్ ఏర్పాటుతో పాటు, జేబు దొంగల పట్ల ప్రజలను అప్రమత్తం చేసేలా అనౌన్స్‌మెంట్లు చేయాలని పోలీసులకు సూచించారు. ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు అల్పాహారం, భోజనం అందించనున్నాయని, కులమతాలకు అతీతంగా వచ్చిన ప్రతి ఒక్కరికీ చేప ప్రసాదం అందేలా ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు. మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. బత్తిని సోదరులు 176 ఏళ్లుగా విశ్వాసంతో అందిస్తున్న ఈ చేప ప్రసాదం ఆస్తమా, శ్వాసకోశ వ్యాధులకు దివ్యౌషధంగా పనిచేస్తుందని తెలిపారు. పంపిణీ కోసం మత్స్య శాఖ ఆధ్వర్యంలో సుమారు లక్షా 40 వేల నాణ్యమైన కొర్రమీను చేప పిల్లలను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారని, కార్యక్రమం ముగిసే వరకు మంత్రులం ఇక్కడే ఉండి పర్యవేక్షిస్తామని తెలిపారు. ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఈ ప్రసాదాన్ని స్వీకరించాలని నేతలు పిలుపునిచ్చారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, అదనపు సీపీ తఫ్సీర్ ఇక్బాల్‌తో కలిసి త్రాగునీరు, విద్యుత్, వేదిక, వీఐపీ క్యూలైన్లు, బారికేడింగ్ తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ బి. సంతోష్, గోషామహల్ డిప్యూటీ కమిషనర్ ఉష ప్రకాష్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటి, ఆర్డీఓ రామకృష్ణతో పాటు జీహెచ్ఎంసీ, రెవెన్యూ, విద్యుత్, మత్స్య, పోలీసు, ఆర్ అండ్ బి శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం: వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్



మహిళల భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ పనిచేస్తుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ స్పష్టం చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శనివారం ధర్మసాగర్ మండలం పెండ్యాల గ్రామంలో రెవెన్యూ, పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీ గ్రామస్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి మహిళ ఎంతో ఆత్మస్థైర్యంతో, విశ్వాసంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. నేడు ప్రపంచవ్యాప్తంగా మహిళలు అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తున్నారని, వారు తమ లక్ష్యాలను సాధించడానికి ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని గుర్తుచేశారు. మహిళల రక్షణ కోసం 'షీ టీమ్స్' అహర్నిశలు పనిచేస్తున్నాయని, ఎవరైనా వేధింపులకు గురిచేస్తే మౌనంగా భరించకుండా తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పిల్లల భవిష్యత్తు, వారి ఉన్నత చదువుల అభివృద్ధిలో తల్లి పాత్ర అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ఇదే వేదికపై రోడ్డు భద్రత గురించి వివరిస్తూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ధర్మసాగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రావు, స్థానిక సర్పంచ్ మరియు రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గండిపేట భూకబ్జా కేసు

### వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లాకు 14 రోజుల రిమాండ్

### చంచల్‌గూడ జైలుకు తరలించిన పోలీసులు

హైదరాబాద్,

గండిపేట భూకబ్జా కేసులో అరెస్టైన వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు ఉప్పరపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఆయనను చంచల్‌గూడా జైలుకు తరలించారు. ఈ కేసు తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, భూకబ్జా కేసులో నిందితుడిగా ఉన్న బొల్లా బ్రహ్మనాయుడిని సైబరాబాద్ పోలీసులు తమిళనాడులోని కాంచీపురంలో అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనను రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్‌కు తీసుకువచ్చి నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో భాగంగా స్టేట్‌మెంట్ నమోదు చేసిన అధికారులు, ఆ తర్వాత న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. బొల్లా బ్రహ్మనాయుడిని నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తీసుకువస్తున్నారనే సమాచారం అందడంతో వైసీపీ కార్యకర్తలు, ఆయన అనుచరులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా పోలీస్ స్టేషన్‌లోకి ఎవరినీ అనుమతించ లేదు. దీంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నార్సింగి పోలీస్ స్టేషన్ నుంచి బొల్లా బ్రహ్మనాయుడిని కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉప్పరపల్లి కోర్టుకు తరలించారు.

# బాధితులకు న్యాయం చేస్తూ పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెంపొందించాలి

## -- పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 06:**





నేరస్తులకు శిక్ష పడడంలో కోర్టు డ్యూటీ పోలీస్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. శనివారం సీపీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో కోర్టు డ్యూటీ, కోర్టు లైజనింగ్ పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలపై జరిగే నేరాలు, ఆస్తి సంబంధిత నేరాలు, శారీరక దాడుల కేసుల్లో నిందితులకు తప్పనిసరిగా శిక్ష పడే విధంగా పకడ్బందీ దర్యాప్తు చేపట్టి, బలమైన సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టాలని సూచించారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా దర్యాప్తు అధికారులు, కోర్టు డ్యూటీ సిబ్బంది, కోర్టు లైజనింగ్ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నేరస్తులకు శిక్ష పడడం ద్వారా బాధితుల్లో న్యాయవ్యవస్థపై విశ్వాసం పెరుగుతుందని, సమాజంలో నేరాల నియంత్రణకు కూడా ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. ఎన్‌బీడబ్ల్యూలు, సమన్లను తప్పనిసరిగా అమలు చేయాలని, కేసుల విచారణ సమయంలో నిందితులకు శిక్షలు పడేలా చూడటం కూడా పోలీసుల ప్రధాన బాధ్యతేనని స్పష్టం చేశారు. సాక్షుల వాంగ్మూలాలు, సాంకేతిక ఆధారాలు, వైద్య ఆధారాలను సమగ్రంగా సేకరించి కోర్టుకు సమర్పిస్తేనే నేరస్తులకు శిక్ష విధించడం సాధ్యమవుతుందని తెలిపారు. నేరం జరిగిన వెంటనే శిక్ష విధించబడితే అది నేరస్తులపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. కాంటెస్టెడ్ కేసుల్లో బాధితులను నిందితులు బెదిరించే అవకాశం ఉంటుందని, అలాంటి సందర్భాల్లో కోర్టు డ్యూటీ అధికారులు బాధితులతో నిరంతరం సంప్రదింపులు జరపాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే సంబంధిత ఎస్‌హెచ్‌వో, ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. సిబ్బంది వృత్తిపరంగా లేదా వ్యక్తిగతంగా ఏవైనా సమస్యలు ఉన్నా నేరుగా తనను సంప్రదించవచ్చని తెలిపారు. సమర్థవంతంగా పనిచేసే సిబ్బందికి తగిన గుర్తింపు, ప్రోత్సాహకాలు ఉంటాయని పేర్కొన్నారు. తమ పనితీరుతో బాధితులకు న్యాయం చేస్తూ పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెంపొందించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం పలు కేసుల్లో నిందితులకు శిక్షలు పడడంలో కీలక పాత్ర పోషించిన కోర్టు డ్యూటీ సిబ్బంది, కోర్టు లైజనింగ్ అధికారులను పోలీస్ కమిషనర్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, వర్టికల్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్లు అనిల్ కుమార్, బాబురావు, ఎస్‌ఐ వినీత, కోర్టు డ్యూటీ సిబ్బంది, కోర్టు లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.

## గ్రామ సమస్యలపై అవగాహన పెంపొందించుకోవాలి

### -- గుంజపడుగు సర్పంచ్ దండేవేన సంధ్య బానేష్

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 06:**



మంథని మండలం గుంజపడుగు గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దండేవేన సంధ్య బానేష్ మాట్లాడుతూ గ్రామ సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, పారిశుధ్యం, విద్యుత్ సౌకర్యాలు, రైతులు సాగు చేయాల్సిన పంటలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే బాల్య వివాహాల నివారణపై ప్రజల్లో చైతన్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యుత్ శాఖ అధికారులు వంగిన విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న తీగల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తడి చేతులతో విద్యుత్ స్విచ్‌లు ఆన్ చేయరాదని ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారి డాక్టర్ నవ్య మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు సాగు చేయాల్సిన పంటలు, అనుసరించాల్సిన వ్యవసాయ విధానాలపై వివరించారు. వైద్యాధికారి వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వర్షాకాలం ముందు పాటించాల్సిన పరిశుభ్రత చర్యలను వివరించారు. జీపీఓ ఓటరు జాబితా సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీఓ షబ్బీర్, ఉప సర్పంచ్ ఎల్క లక్ష్మి హాజరయ్యారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు దొడ్డిపట్ల శంకర్, దేవరకొండ పోచం, శనిగారపు సుమలత, కాజీపేట తిరుపతి, భోగే సంపత్, భోగే రాజేశ్వరి, దేవల లక్ష్మి, గ్రామ కార్యదర్శి సరస్వతి, సతీష్ కుమార్‌తో పాటు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రామగిరి ఖిల్లా అభివృద్ధి కోసం భూములు తీసుకుంటున్నారు.. మా గ్రామాభివృద్ధికి సహకరించండి

### ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు



**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 06:**

రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మేడిపల్లి శివారులో రామగిరి ఖిల్లా అభివృద్ధి కోసం సుమారు 200 ఎకరాల భూమిని ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు సేకరిస్తున్న నేపథ్యంలో తమ గ్రామ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు కోరారు. శుక్రవారం రత్నాపూర్ గ్రామ పంచాయతీని సందర్శించిన మంథని ఆర్డీవో కాసబోయిన సురేష్, తహసీల్దార్ పర్నంది సుమన్‌లకు ఆమె వినతిపత్రం అందజేశారు. గ్రామం అభివృద్ధిలో వెనుకబడినందున మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రామగిరి ఖిల్లా రహదారిగా ఉపయోగపడుతున్న రత్నాపూర్–మన్నాలవాడ మార్గంలో సిమెంట్ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని కోరారు. అలాగే రత్నాపూర్‌లోని సంజీవనగర్ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి వాగుకట్ట మీదుగా తులభూమయ్య పొలం మీదుగా రామగిరి ఖిల్లాకు వెళ్లే మార్గంలో సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలోని పల్లెవాడ ప్రాంతంలో కెక్కర్ల శివ ఇంటి ముందు నుంచి గూడ్ల రమేష్ ఇంటి వరకు సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించాలని కోరారు. రైతుల పొలాలకు వెళ్లే ప్రధాన మార్గమైన తెట్టెకుంట నుంచి ఆర్‌ఎస్‌ఐబి ఆఫ్ డి/83 ప్రధాన కాలువ వరకు ఉన్న మట్టి రోడ్డు దయనీయ స్థితిలో ఉందని, దానిని కంకర లేదా తారు రోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరారు. అదేవిధంగా రాంనగర్‌లో వాటర్ ట్యాంక్ ఎదురుగా ఉన్న రహదారి దెబ్బతిన్నందున నూతన సీసీ రోడ్డు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. రామగిరి ఖిల్లా ప్రాంతంలో వైకుంఠధామం, ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు 20 ఎకరాల భూమి కేటాయించాలని కూడా కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బత్తిని ప్రశాంత్, అల్లి రమేష్, కనవేన రవి, బత్తుల రాజమణి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేత్రదానం -- మరొకరికి వెలుగునిచ్చే మహాదానం

### లయన్స్ క్లబ్, సదాశయ ఫౌండేషన్ నాయకుల పిలుపు



**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 06:**

నేత్రదానం మానవతా దృక్పథానికి ప్రతీకగా నిలిచే గొప్ప దానమని కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణ రెడ్డి, సదాశయ ఫౌండేషన్ నాయకులు నల్లవెల్లి శంకర్, నూక రమేష్, అనంతరాములు, కాసర్ల మహేందర్ రెడ్డి అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో ఎఫ్‌సీఐ రిటైర్డ్ ఉద్యోగి కొండు రాజేశ్వర్ రావు దశదిన కర్మ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు నేత్రదానం సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరణానంతరం కంటి కార్నియాలను దానం చేయడం ద్వారా దృష్టిలోపంతో బాధపడుతున్న ఇద్దరు వ్యక్తులకు తిరిగి చూపు కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంపొందించుకుని, తమ కుటుంబ సభ్యులతో ఈ విషయాన్ని చర్చించి నేత్రదానానికి ముందుకు రావాలని సూచించారు. నేత్రదానం చేయడానికి వయస్సు, లింగం, కంటి చూపు వంటి అంశాలు సాధారణంగా అడ్డంకి కావని తెలిపారు. వ్యక్తి మరణించిన అనంతరం వీలైనంత త్వరగా సమీప నేత్ర బ్యాంకుకు సమాచారం అందిస్తే వైద్య సిబ్బంది అవసరమైన ప్రక్రియను పూర్తి చేస్తారని చెప్పారు. నేత్రదానం వల్ల మృతదేహానికి ఎలాంటి వికృత రూపం కలగదని, అంత్యక్రియలకు కూడా ఎటువంటి ఇబ్బంది ఉండదని వివరించారు. సమాజంలో నేత్రదానంపై ఉన్న అపోహలను తొలగించడం అవసరమని పేర్కొంటూ, "మరణం తర్వాత కూడా మన కళ్ళు మరొకరి జీవితంలో వెలుగులు నింపగలవు" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరారు. నేత్రదానం ద్వారా దృష్టి కోల్పోయిన వారికి కొత్త ఆశ, కొత్త జీవితాన్ని అందించవచ్చని తెలిపారు. ప్రజలందరూ నేత్రదాన ప్రతిజ్ఞ చేసి, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులను కూడా ఈ మహోన్నత సేవలో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. "నేత్రదానం చేయండి -- ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపండి" అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు, కరీంనగర్ కార్పొరేటర్ తాటి ప్రభావతి, తహసీల్దార్ బీరుకూరి దత్తు ప్రసాద్ రావు, కుటుంబ సభ్యులు కొండు రవీందర్ రావు, పల్లె అమర, ఉనుగొండ జయశ్రీ, శ్రీనివాసరావు, బాలసంకుల రాధ, రాజేందర్ రావు, కొండు వేణు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రత కోసమే షీ టీం: మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 06**



మహిళల భద్రత, రక్షణ కోసం పోలీస్ శాఖ ప్రత్యేకంగా షీ టీంను ఏర్పాటు చేసిందని మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ తెలిపారు. లక్షెట్టిపేట పట్టణంలోని ఎల్‌కే గార్డెన్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వార్డు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, సేవలు, స్థానిక సమస్యలను తెలుసుకునేందుకు ప్రతి వారం వివిధ శాఖల అధికారులను క్షేత్రస్థాయికి పంపుతున్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితులు లేదా భద్రతాపరమైన సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే 100 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. కాల్ వచ్చిన ఐదు నిమిషాల్లోపు పోలీసులు స్పందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రస్తుతం కొంతమంది యువతులు ప్రేమ పేరుతో లేదా ఇతర కారణాలతో మోసపోతున్న ఘటనలు పెరుగుతున్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. మహిళలపై వేధింపులు, అసభ్య ప్రవర్తన వంటి ఘటనలు ఎదురైనప్పుడు షీ టీంను సంప్రదించాలని కోరారు. మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేసిన డీసీపీ, ఇటీవల గంజాయి నిల్వ, విక్రయం, వినియోగానికి సంబంధించిన కేసుల్లో సుమారు 70 మందిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్లు లేదా వినియోగిస్తున్నట్లు అనుమానం వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీని మున్సిపల్ చైర్‌పర్సన్ దొంత అంజలి నరసయ్య, మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, వార్డు కౌన్సిలర్లు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్ కుమార్, లక్షెట్టిపేట ఎస్‌ఐ గోపతి సురేష్, షీ టీం ఎస్‌ఐ హైమ, ఏవో శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం కమిషనరేట్‌లో డ్రగ్ కంట్రోల్ ప్రత్యేక బృందాల ఏర్పాటు

### గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనే లక్ష్యం: పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 06**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణా, సరఫరా, నిల్వ, విక్రయం, వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్లలో సర్కిల్ వారీగా డ్రగ్ కంట్రోల్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే కమిషనరేట్‌లో ఒక ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో రెండు యాంటీ నార్కోటిక్ బృందాలు పనిచేస్తుండగా, వాటికి అదనంగా సర్కిల్ స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మత్తు పదార్థాల అక్రమ రవాణా మూలాలను గుర్తించడంతో పాటు వాటి సరఫరా, వినియోగంపై మరింత కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బృందాలు గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచార సేకరణ, అనుమానాస్పద వ్యక్తులు, ప్రాంతాలపై నిఘా నిర్వహించడంతో పాటు సమాచార దాతల వ్యవస్థ (ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్), ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రత్యేక దాడులు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల సరఫరా, రవాణా, నిల్వ, విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712656597కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేయడంతో పాటు సమాజ అభివృద్ధికి తీవ్ర ముప్పుగా మారుతున్నాయని కమిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్ తరాల శ్రేయస్సు కోసం గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 06**

మద్యం సేవించి వాహనాలను నిర్లక్ష్యంగా, అతివేగంగా నడిపే వ్యక్తులు ట్రాఫిక్ పోలీసులకు చిక్కితే జైలు శిక్ష తప్పదని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న వారిని నియంత్రించేందుకు చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పెద్దపల్లి పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 19 మందిని శనివారం స్థానిక న్యాయస్థానంలో హాజరుపర్చారు. కేసును విచారించిన జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎన్. మంజుల, రాసులపల్లికి చెందిన బుద్దుల మధుకర్ (27)కు నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించినట్లు పెద్దపల్లి ట్రాఫిక్ సీఐ బి. శ్రీనివాస్ తెలిపారు. అలాగే మిగిలిన 18 మందికి మొత్తం రూ.19,500 జరిమానా విధించినట్లు న్యాయస్థానం తీర్పులో పేర్కొన్నట్లు ట్రాఫిక్ సీఐ వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడపకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పోలీసులు సూచించారు.

PRGI NO: TGTEL/25/A5514
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక



# ఇలాంటి అవకాశం మళ్లీ రాదు!

‘ఓ గ్రామం మొత్తం మాట్లాడలేక, కేవలం పాటల రూపంలో సంభాషించే కథ ఇప్పటివరకూ రాలేదు. నా కెరీర్‌లోనే ఇదొక సవాలు. ఈ సినిమా స్క్రిప్ట్ చదివిన తర్వాత ప్రతీ డైలాగ్‌ను సంగీతంగా మార్చాల్సి వచ్చింది’ అన్నారు అగ్ర సంగీత దర్శకుడు, రాక్‌స్టార్ దేవిశ్రీప్రసాద్. లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు రూపొందిస్తున్న ‘సింగ్ గీతం’ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ సంగీతాన్నందిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు నాగ్‌అశ్విన్ నిర్మిస్తున్న ఈ సినిమా ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకురానుంది.





# జెన్‌జీ ప్రేమకథగా మొహబ్బత్

సంతోష్ కల్వచర్ల, శ్రేయాసి సేన్ జంటగా రూపొందుతున్న యువతరం ప్రేమకథ ‘మొహబ్బత్’. మ్యాక్ దర్శకత్వంలో అఫ్రోజ్ షేక్ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభోత్సవం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి శాసనసభ్యుడు నవీన్ యాదవ్ క్లాప్‌నివ్వగా, చిత్రనిర్మాత అఫ్రోజ్ షేక్ కెమెరా స్విచాన్ చేశారు. నవీన్ యాదవ్, చిన్న శ్రీశైలం యాదవ్ సినిమాకు సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని లాంచ్ చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. ఎమోషనల్ యూత్‌ఫుల్ జెన్‌జీ సినిమా ఇదని దర్శకుడు మ్యాక్ తెలిపారు. నిర్మాతగా తన తొలి ప్రయత్నం తప్పక సఫలం అవుతుందనే నమ్మకాన్ని నిర్మాత అఫ్రోజ్ షేక్ వ్యక్తం చేశారు. ఇంకా హీరోహీరోయిన్లతో పాటు రచయిత కలాం కూడా మాట్లాడారు. అజయ్ ఘోష్, సాత్విక్ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: వైఎస్ కృష్ణ, సంగీతం: సునీల్ కశ్యప్, నిర్మాణం: ఏబీఎస్ ప్రొడక్షన్స్

# ప్రేమకంటే గొప్ప యుద్ధం లేదు

రాయలసీమ విలేజ్ యాక్షన్ డ్రామా ‘లెనిన్’తో ఈ నెల 26న ప్రేక్షకుల ముందుకురాబోతున్నాడు అక్కినేని అఖిల్. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాల్ని పెంచాయి. సామాజికాంశాల నేపథ్యంలో రూపొందిస్తున్న ఈ చిత్రంలో తన వారిని, ప్రేమను గెలిపించుకోవడానికి ప్రతీపశక్తులతో యుద్ధం చేసే యువకుడిగా అఖిల్ కనిపిస్తారని సమాచారం. తాజాగా ‘పెద్ది’ ప్రదర్శిస్తున్న థియేటర్లలో ‘సోల్ ఆఫ్ లెనిన్’ పేరుతో ఓ పాటను చూపిస్తున్నారు. ఇందులో నాయకానాయికలు అఖిల్, భాగ్యశ్రీ బోర్సే మధ్య ఉండే అనుబంధాన్ని హృద్యంగా ఆవిష్కరించారు. ‘ప్రేమకంటే గొప్ప యుద్ధం లేదు’అనే క్యాప్షన్‌తో తమన్ స్వరకల్పనలో రూపొందిన ఈ పాట ప్రేక్షకుల్ని ఎంతగానో ఆకట్టుకుంటున్నదని మేకర్స్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: లియోన్ బ్రిట్టో, సంగీతం: తమన్, సమర్పణ: అన్నపూర్ణ స్టూడియోస్, రచన–దర్శకత్వం: మురళీకిషోర్ అబ్బూరు.



# అగ్ని.. విశ్వం త్యాగం వెరసి రాకా

‘పుష్ప’ ఫ్రాంచైజీతో పానిండియా ఇమేజ్‌ని సొంతం చేసుకున్నారు అల్లు అర్జున్. ప్రస్తుతం ఆయన అట్లీ దర్శకత్వంలో ‘రాకా’ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ‘పుష్ప2’ తర్వాత వస్తున్న సినిమా కావడంతో, ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, అత్యంత ప్రతిష్టాత్మకంగా సన్ పిక్చర్స్‌వారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దర్శకుడు అట్లీ తనదైన శైలి మాస్ ఎలిమెంట్స్‌కు ఎమోషన్స్, భారీ యాక్షన్ సీక్వెన్స్, సైన్స్ ఫిక్షన్‌ను జోడించి ఈ కథను తయారు చేసినట్టు ఇన్‌సైడ్ టాక్. ఫస్ట్‌లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలు పెంచింది. త్వరలో గ్లింప్స్ కూడా విడుదలయ్యే అవకాశం ఉంది. రాకా ప్రపంచాన్ని, దాని విజువల్ స్కేల్‌ని ఈ గ్లింప్స్ ద్వారా పరిచయం చేయనున్నారు.ఇదిలావుంటే.. తాజాగా ఈ సినిమా గురించి ఆసక్తికరమైన విషయం వెలుగు చూసింది. ‘రాకా’ కథ పునర్జన్మల నేపథ్యంలో సాగుతుందట. మూడు కాలాల్లో నడిచే ఈ కథలో అల్లు అర్జున్ మూడు రకాల భిన్నమైన పాత్రల్లో కనిపిస్తారట. ‘అగ్ని.. విశ్వం.. త్యాగం..’ ఈ మూడింటి చుట్టూనే ఈ సినిమా కాన్సెప్ట్ నడుస్తుందని తెలిసింది. షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా సమాంతరంగా జరుగుతున్నాయి. వీఎఫ్‌ఎక్స్ కీ రోల్ పోషించే ఈ చిత్రంలో దీపిక పదుకోణ్ కథానాయిక కాగా, మృణాల్ ఠాకూర్, రష్మిక మందన్నా ప్రత్యేక పాత్రల్లో మెరవనున్నారని సమాచారం.



# తుపానులా పెద్ది వసూళ్లు

‘పెద్ది’ చిత్రానికి ప్రీమియర్స్ నుంచే అద్భుతమైన స్పందన లభించిందని, తొలిరోజు హీరో రామ్‌చరణ్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా నిలిచిందని ఆనందం వ్యక్తం చేశారు చిత్ర నిర్మాత వెంకట సతీష్ కిలారు. రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వృద్ధి సినిమాస్ పతాకంపై ఆయన నిర్మించిన ‘పెద్ది’ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా శుక్రవారం ‘బాక్సాఫీస్ ఛాంపియన్’ పేరుతో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట సతీష్ కిలారు మాట్లాడుతూ ‘ఈ చిత్రం తొలిరోజే 135 కోట్లకుపైగా వసూళ్లను సాధించింది. ప్రేక్షకులు ఈ సినిమాను బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలబెట్టారు. పిల్లలతో కలిసి థియేటర్లలో ఈ సినిమా చూడండి. ప్రతి ఒక్కరికి స్ఫూర్తివంతంగా అనిపిస్తుంది’ అన్నారు.





# అదే అలవాటుగా మారింది!

వింత పోకడలు, విచిత్రమైన అభిరుచులు మనుషుల్లో కామన్. బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాకూర్ ఆహారపు అలవాట్లు వింటే మరీ విడ్డూరం అనిపించక మానదు. ఈ ముద్దుగుమ్మ అన్నంలో ఐస్‌క్రీమ్ కలుపుకొని తింటుందట. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని తానే స్వయంగా చెప్పింది. ‘ఈ అలవాటు నా ఫ్రెండ్ నుంచి నాకు వచ్చింది. తను ఓ సారి రైస్‌లో ఐస్‌క్రీమ్ కలుపుకొని తినడం చూశాను. చూసిన దాన్ని చూసినట్టుగా ఉండక, ఇంటికెళ్లి ట్రై చేశాను. నిజం చెబుతున్నాను.. ఆ టేస్ట్ చాలా కొత్తగా అనిపించింది. నిదానంగా అది అలవాటుగా మారింది. నాకు నచ్చిందని అందరికీ నచ్చాలని లేదు’ అంటూ చెప్పుకొచ్చింది మృణాల్ ఠాకూర్. ఇది విన్నవారంతా ‘అన్నంలో ఐస్‌క్రీమ్ కలుపుకొని తినడమేంటి?.. పిచ్చికాకపోతే..’ అంటూ కామెంట్లు పెడుతున్నారు. కొందరైతే.. ‘ట్రై చేస్తే తప్పేంటి?’ అని కూడా అంటున్నారు. జిహ్వాకో రుచి, పుర్రెకో బుద్ధి అని ఊరికే అనలేదు!

# సమాజ సేవకునికి రాష్ట్రస్థాయి గుర్తింపు

## అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా జంబోజు సమ్మయ్య చారి నియామకం

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 06:**



మంథని పట్టణానికి చెందిన విశ్వబ్రాహ్మణ వేదిక నాయకుడు జంబోజు సమ్మయ్య చారి అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంథని ప్రాంత విశ్వకర్మ సంఘం నాయకులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు.గత 20 సంవత్సరాలుగా సమాజానికి విశిష్ట సేవలందిస్తున్న జంబోజు సమ్మయ్య చారి అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులు కావడం ఈ ప్రాంతానికి గర్వకారణమని వారు పేర్కొన్నారు. ఈ మేరకు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు నౌండ్ల సంతోష్ చారి నియామక ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా జంబోజు సమ్మయ్య చారి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ఉపాధ్యక్ష పదవిని అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు నౌండ్ల సంతోష్ చారికి కృతజ్ఞతలు తెలిపారు. విశ్వకర్మ బంధువుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారం కోసం మరింత చిత్తశుద్ధితో కృషి చేస్తానని చెప్పారు.అలాగే రాష్ట్రవ్యాప్తంగా విశ్వకర్మ సమాజ ఐక్యత, అభివృద్ధి, సామాజిక పురోగతి కోసం తన వంతు సేవలను అందిస్తానని తెలిపారు. సమ్మయ్య చారి అందరితో కలుపుగోలుగా ఉంటూ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసే వ్యక్తి అని సంఘం సభ్యులు కొనియాడారు. ఆయన నియామకం పట్ల విశ్వకర్మ సంఘాల నాయకులు, సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# తెలంగాణ మజ్దూర్ యూనియన్ మంథని డిపో నూతన కమిటీ ఎన్నిక



**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 06:**

టిజిఎస్ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ మంథని డిపో నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఈ కమిటీలో ముఖ్య సలహాదారులుగా వి ఐలయ్య (ఏడీసీ), చైర్మన్‌గా ఏ రమేష్, అధ్యక్షుడిగా ఎస్ శేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి జనార్ధన్, ప్రధాన కార్యదర్శిగా కె కె రెడ్డి, జాయింట్ సెక్రటరీగా ఎండి మునీర్, చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా కె ఆర్ రావు, కోశాధికారిగా బి తిరుపతి ఎన్నికయ్యారు.అలాగే గ్యారేజ్ విభాగ ప్రధాన కార్యదర్శిగా జి కృష్ణ, మహిళా విభాగ ప్రధాన కార్యదర్శిగా ఎండి ఇంతియాజ్ బేగం, వైస్ ప్రెసిడెంట్‌గా ఏ గోపి, సహాయ కార్యదర్శిగా ఎస్ రాజయ్యతో పాటు మొత్తం 40 మంది సభ్యులతో కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం డిపో మేనేజర్ కార్యాలయంలో కొత్తగా ఎన్నికైన సభ్యులకు రీజినల్ కమిటీ సభ్యుల సమక్షంలో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను డిపో మేనేజర్ అభినందిస్తూ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా పనిచేయాలని సూచించారు. కొత్త కమిటీ సభ్యులు కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తామని తెలిపారు.

# గుండా నాగరాజుకు ఘన నివాళి



**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 06:**

తెలంగాణ ఉద్యమకారుడు స్వర్గీయ గుండా నాగరాజుకు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఘన నివాళులు అర్పించారు. నాగరాజు వర్ధంతి సందర్భంగా మంథని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పుట్ట మధూకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో గుండా నాగరాజు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. తెలంగాణ ఉద్యమ లక్ష్యాల సాధన కోసం ఆయన చేసిన త్యాగాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని అన్నారు. సాధించిన తెలంగాణ రాష్ట్రంలో గుండా నాగరాజు లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ తెలంగాణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని నాగరాజుకు నివాళులు అర్పించారు.

# పీజీటీ గణితశాస్త్ర (మ్యాథమెటిక్స్) పోస్టుకు హెచ్‌బీటీ నియామకం

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 06:**

ముత్తారం (మంథని) మండలంలోని దర్యాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో పీజీటీ-మ్యాథమెటిక్స్ పోస్టును అవర్‌లీ బేస్డ్ టీచర్ (హెచ్‌బీటీ) విధానంలో భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ డా. కేసరి సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎంఎస్సీ మ్యాథమెటిక్స్‌తో పాటు బీఈడ్ అర్హతలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. అలాగే 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ స్థాయి వరకు విద్యార్థులకు బోధించగల సామర్థ్యం ఉండాలని సూచించారు.అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులతో పాటు డెమో తరగతి నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ జూన్ 15, 2026 కాగా, డెమో తరగతులు జూన్ 15, 16 తేదీల్లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం ప్రిన్సిపాల్ డా. కేసరి సంతోష్ కుమార్‌ను 9885354200 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులు వినియోగించుకోవాలని కోరారు.

# కామ్రేడ్ కాల్వ నరసయ్య యాదవ్ జయంతి

**భీమారం (మంచిర్యాల ) , అర్జున్ సమాచారం , జూన్ -06**



తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం వ్యవస్థాపకులు డా. కొమ్ము అశోక్ యాదవ్, గొర్రెల కాపరుల ఉద్యమ స్ఫూర్తి కామ్రేడ్ కాల్వ నరసయ్య యాదవ్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ .. కాల్వ నరసయ్య యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "గొర్రెల మేకల కాపరుల హక్కుల కోసం, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం కామ్రేడ్ కాల్వ నరసన్న చేసిన పోరాటాలు, త్యాగాలు మనందరికీ ఆదర్శం. ఆయన చూపిన బాటలో నడిచి గొర్రెల మేకల కాపరుల సంక్షేమం కోసం మనమంతా పోరాడాలి" అని పిలుపునిచ్చారు.కాల్వ నరసన్న ఆశయాల సాధన కోసమే కాకుండా, గొర్రెల మేకల కాపరుల జీవనోపాధి పరిరక్షణ కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. నరసయ్య యాదవ్ వృత్తిదారుల సంఘాన్ని స్థాపించి, గొర్రెల కాపరులను సంఘటితపరిచి, వారి హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియాడారు. ఆయన స్ఫూర్తే నేడు లక్షలాది గొర్రెల కాపరులకు బలమై నిలిచిందని, అలాంటి గొప్ప వ్యక్తి నేడు మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమని అన్నారు. గొర్రెల కాపరుల హక్కుల కోసం పోరాడిన కామ్రేడ్ కాల్వ నరసయ్య యాదవ్ గారి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డా. కొమ్ము అశోక్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మెండే మల్లేష్ యాదవ్, మండల గౌరవ అధ్యక్షులు వేల్పుల పర్వతాలు యాదవ్, ప్రధాన కార్యదర్శి కేశవేణి సత్యనారాయణ యాదవ్, ఉపాధ్యక్షులు దారవేని తిరుపతి యాదవ్, శ్రీనివాస్ యాదవ్, గాదె తిరుపతి యాదవ్, ఎల్ఐసి రేషవేణి శ్రీనివాస్ యాదవ్, కొక్కుల నరేష్, సముద్రాల బాలమల్లు, రాజన్న ప్రతినిధులు పాల్గొన్నారు.

# లద్నాపూర్‌లో ప్రత్యేక గ్రామసభ నిర్వహణ



**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 06:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రామగిరి మండలం లద్నాపూర్ గ్రామ పంచాయతీలో శనివారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలు, గ్రామాభివృద్ధి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.గ్రామసభకు సర్పంచ్ అధ్యక్షత వహించగా, మండల రెవెన్యూ అధికారి (ఎంఆర్వో), మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ), సీఐ, ఎస్ఐ, వ్యవసాయ అధికారి, హార్టికల్చర్ అధికారి, వైద్యాధికారి, కేవీకే శాస్త్రవేత్త, ఎన్‌పీడీసీఎల్ సబ్ ఇంజినీర్ తదితర అధికారులు పాల్గొన్నారు. అలాగే ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై గ్రామసభను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా అధికారులు వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వివరాలు తెలియజేసి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అధికారులు సూచించారు.

# మంచిర్యాల--హైదరాబాద్ మధ్య కొత్త జాతీయ రహదారి నిర్మాణానికి వినతి

**అర్జున్ సమాచారం జూన్ 06 మంచిర్యాల జిల్లా ప్రతినిధి:**



మంచిర్యాల, జూన్ 6: మంచిర్యాల--హైదరాబాద్ మధ్య ప్రస్తుతం ఉన్న రాజీవ్ రహదారిపై పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కొత్త జాతీయ రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నాగ్‌పూర్--హైదరాబాద్ గ్రీన్ ఫీల్డ్ హైవేను చంద్రపూర్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, సిద్దిపేట జిల్లాల మీదుగా హైదరాబాద్ వరకు నిర్మించే అవకాశాలను పరిశీలించాలని కోరారు.ఈ రహదారి నిర్మాణం వల్ల ఉత్తర తెలంగాణ ప్రాంతానికి మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించబడటంతో పాటు పారిశ్రామిక, వాణిజ్య, ఆర్థిక అభివృద్ధికి కూడా దోహదపడుతుందని తెలిపారు. అలాగే ప్రయాణ సమయం తగ్గడంతో ప్రజలకు మరింత సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని రఘునాథ్ వెరబెల్లి విజ్ఞప్తి చేశారు.

# అట్టహాసంగా 'ప్రజా పాలన' ముగింపు గ్రామసభ

## పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి

**భీమారం (మంచిర్యాల ) , అర్జున్ సమాచారం , జూన్ -06**

గ్రామ సమగ్ర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ప్రజల భాగస్వామ్యమే ధ్యేయంగా భీమారం మండలం అరెపల్లి గ్రామ పంచాయతీలో శనివారం ఉదయం 'ప్రజా పాలన' ముగింపు ప్రత్యేక గ్రామసభను అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఆకుదారి వీరయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభకు మండల స్థాయి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఆకుదారి వీరయ్య మరియు అధికారులు గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సభలో కొత్త ఓటర్ల నమోదు - సవరణలు,పర్యావరణ పరిరక్షణ, నాలుగు రకాల చెత్త డబ్బాల నిర్వహణ - జరిమానాలు,జల సంరక్షణ,నకిలీ విత్తనాలపై నిఘా, డ్రగ్స్ రహిత గ్రామం మొదలగు అంశాలపైన ఆయా సంబందిత అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ ప్రత్యేక గ్రామసభలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపిడిఓ ) మధుసూదన్, ఎంపీఓ (ఎంపిఓ ) సతీష్ రెడ్డి, ఆర్ ఆర్‌డబల్యూ ఏఈఈ రాజమౌళి, మండల వ్యవసాయ అధికారి అత్తే సుధాకర్, డిప్యూటీ తహసిల్దర్ అంజమ్మ, ఎఫ్ఎస్ఓ , విమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారిణి ఎస్. లిప్సిక, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. అలాగే ఉప సర్పంచ్ తాని శ్రీలత, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి దేవేందర్ రెడ్డి, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ/ ఎస్‌హెచ్‌జి గ్రూప్ మహిళలు మరియు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేశారు.



# వన్యప్రాణులు, పక్షుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకం

## -- మంథని అటవీ రేంజ్ అధికారి ఎం. వినయ్ నాయక్



**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 06:**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా వన్యప్రాణులు, పక్షుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని మంథని అటవీ రేంజ్ అధికారి ఎం. వినయ్ నాయక్ అన్నారు.శనివారం ముత్తారం (మంథని) మండలంలోని పారుపల్లి గ్రామ పరిధిలోని మైదంబండ బీట్, బేగంపేట సెక్షన్‌లో ఉన్న పారుపల్లి పెద్ద చెరువు వద్ద "బర్డ్ వాక్స్ అండ్ వైల్డ్ లైఫ్ అవేర్‌నెస్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువతకు అడవుల్లో నివసించే వివిధ రకాల పక్షులు, వన్యప్రాణులు, జీవ వైవిధ్యం ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎం. వినయ్ నాయక్ మాట్లాడుతూ ప్రకృతి, పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో పక్షులు, వన్యప్రాణులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. జీవ వైవిధ్య పరిరక్షణ ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. అడవులు, చెరువులు, సహజ వనరుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరమని కార్యక్రమంలో భాగంగా బర్డ్ వాచింగ్, ట్రెక్కింగ్, పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ అంశాలపై ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. పారుపల్లి గ్రామ సర్పంచ్ చొప్పరి సంపత్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రకృతి సంపద పరిరక్షణకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి జె. తిరుపతి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎస్.కే. నహీదా పర్వీన్, ఎస్.డి. రహమతుల్లా, ఎం. అమీరుద్దీన్, ఫారెస్ట్ బీట్ అధికారులు ఎస్. మేఘరాజ్, టి. రామ్‌సింగ్, ఎ. మాధురి, పి. రంజిత, బయాలజిస్ట్ చంద్రకాంత్, సర్పంచ్ చొప్పరి సంపత్, పోతారం, పారుపల్లి గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో బ్రాంజ్ మెడల్ సాధించిన మహిళా కానిస్టేబుల్ శ్రీలతకు ఘన సత్కారం

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 06:**



3వ ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో యోగా విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించి రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు గౌరవం తీసుకువచ్చిన పెద్దపల్లి జోన్‌కు చెందిన మహిళా కానిస్టేబుల్ శ్రీలతను శనివారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఘనంగా సత్కరించారు.ఇటీవల హర్యానా రాష్ట్రంలోని కర్నాల్‌లో మే 23న నిర్వహించిన 3వ ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో 35 నుంచి 45 సంవత్సరాల వయో విభాగంలో జరిగిన యోగా పోటీల్లో శ్రీలత ప్రతిభ కనబర్చి బ్రాంజ్ మెడల్‌ను కైవసం చేసుకున్నారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆమెను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి శాఖకు మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో రాణించడం ద్వారా పోలీసు సిబ్బంది శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, కమాన్‌పూర్ ఎస్ఐ ప్రసాద్ తదితర అధికారులు పాల్గొని శ్రీలతను అభినందించారు.

## మైదంబండలో కేతి బచావో అభియాన్ అవగాహన కార్యక్రమం

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 06:**



ముత్తారం మండలంలోని మైదంబండ గ్రామంలో కేతి బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) శశిధర్ రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు.ఈ సందర్భంగా అధికంగా ఎరువులు, పురుగు మందులు వినియోగించడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే రానున్న వర్షాకాలంలో తుఫానుల కారణంగా ఏర్పడే వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు.నీటి వసతి ఉన్న రైతులు వరి సాగులో స్వల్పకాలిక రకాలను మాత్రమే ఎంపిక చేసుకోవాలని తెలిపారు. రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ శశిధర్, గ్రామ సర్పంచ్, రైతులు పాల్గొన్నారు. కార్యక్రమం ద్వారా రైతులకు స్థిరమైన వ్యవసాయ పద్ధతులు, ప్రకృతి అనుకూల సాగు విధానాలపై అవగాహన కల్పించారు.

Printed, Published and Owned by LINGAM RAJAIAH, and Printed at Vijaya Lakshmi Printing Press , H.No.12-180, Gouthaminagar,Mancheria, Mancherial Telangana-504208, and Published at H.No.12-180, Gouthami-nagar,Mancheria,Mancherial Telangana-504208. Editor: LINGAM RAJAIAH. PRGI. No. TGTEL/25/A5314, lingamrajaiahmncl@gmail.com,8121319896.